జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 14 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 160 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 23:09:45 వరకు నక్షత్రంశతభిష - 20:46:16 వరకు కరణంవణిజ - 10:55:14 వరకు, విష్టి - 23:09:45 వరకు పక్షంకృష్ణ యోగంశోభన - 23:22:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా**

న్యూఢిల్లీ,ఆగస్టు13(ప్రజాజ్యోతి): పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా

మిగతా 2లో..

## యూరియా యాప్‌పై రైతుల ఆగ్రహం

**సింగిల్ విండోలో అధికారులను బంధించి నిరసన**

కరీంనగర్,ఆగస్ట్13(ప్రజాజ్యోతి): గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయానికి రైతులు గురువారం తాళం వేసి అందులో సిబ్బందిని బంధించారు. యూరియా యాప్ తో రైతులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తున్నాదని ఆగ్రహం వ్యక్తం

మిగతా 2లో..

## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

### ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే

**మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం**

**కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు**



న్యూఢిల్లీ,ఆగస్ట్13(ప్రజాజ్యోతి): అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై

మిగతా 12లో..






# గత పాలనతో బేరీజు వేయండి

## గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు అండగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించామని వివరించారు. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ లోన్లు అందించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని గుర్తుచేశారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న సీఎం, రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు 1000 ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. శిల్పారామం వద్ద రూ.వెయ్యి కోట్లతో ఇందిరా మహిళాశక్తి స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అప్పులకు వడ్డీలు కడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం అప్పులు చేసి పోయిందని, ఓ వైపు వాటన్నింటినీ తీర్చుకుంటూనే మరోవైపు సంక్షేమం వైపు దృష్టి పెడుతున్నామని సీఎం తెలిపారు.

- రాష్ట్రం ఎండిపోవాలని ప్రతిపక్షాలు కుట్రలు చేశారు
- వారు చేసిన చేతబడి వారికే తిరగబడింది
- నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సీఎం రేవంత్
- వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు
- లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు
- రెవెన్యూ హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,ఆగస్ట్13(ప్రజాజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు.

మిగతా 2లో..

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

**కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి**

న్యూఢిల్లీ,ఆగస్టు13 (ప్రజాజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి

మిగతా 12లో..



## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్13(ప్రజాజ్యోతి): ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు.

మిగతా 2లో..



## పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి
- విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి
- అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి

**అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**

హైదరాబాద్,ఆగస్టు13 (ప్రజాజ్యోతి): రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు,

మిగతా 12లో..

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్టు13(ప్రజాజ్యోతి): దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.



## బీసీ మహిళలకు స్వయం ఉపాధి

**ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం**

హైదరాబాద్,ఆగస్ట్13(ప్రజాజ్యోతి): బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఆర్ఐ

కరీంనగర్,ఆగస్ట్13(ప్రజాజ్యోతి): బీర్ పూర్ మండల కేంద్రంలో ఏసీబీ డీఎస్పీ గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీర్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడి నిర్వహించారు. ఓ బాధితురాలి నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటున్న గిరిధావర్(ఆర్) రాహుల్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. కాగా ఆర్ఐ రాహుల్ గతంలో కథలాపూర్ ఆర్ఐ-1 గా విధులు నిర్వహించగా సర్టిఫికెట్ల జారీలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంతో బీర్పూర్ కు బదిలీ చేశారు.

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర

- జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ఈ అంశాన్ని తొలగించాలి
- ఎంపీలంతా ప్రధాని మోడీని కలిసి వివరించాలి
- బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్

రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్13(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు కుట్రను అడ్డుకోవాలని, జీఆర్ఎంబీ ఎజెండా నుంచి అంశాన్ని వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ హక్కులపై భంగం కలుగుతుంటే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఎందుకుంటున్నారని ప్రశ్నించారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య

మిగతా 12లో..

# సంపాదకీయం

## పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు!

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్ధంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బలంగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా



చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# సీఎం రాకపై రేకెత్తిన ఆశలు..

- 2600 ప్లాట్లు, రూ.8 కోట్లపై ఎదురుచూపులు
- జగ్గారెడ్డి మున్సిపల్ ఎన్నికల వాగ్దానం పై ఆసక్తి
- జగ్గారెడ్డి పట్టుదలకు మారుపేరుగా ఉంటారని ప్రజల భావన
- సంగారెడ్డి సభలో జగ్గారెడ్డి సీఎం రేవంత్ ను ఒప్పించి "పేట" పేదలకు 2600 ప్లాట్లు...
- సదాశివపేటలోని ప్రతి వార్డుకు రూ.8 కోట్ల ప్రకటన ఇప్పిస్తారని ప్రజల్లో నమ్మకం



ప్రజా జ్యోతి, సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్: తెలంగాణ రాష్ట్రం రాకముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్ గా ఉన్న జగ్గారెడ్డి 2012 సంవత్సరంలో సదాశివపేట పట్టణంలో 5,000 మంది నిరుపేదలకు సొంత ఇల్లు నిర్మించుకునేందుకు 5,000 ఇంటి స్థలాలు



(ప్లాట్లు) పంపిణీ చేశారు. ఆ తరువాత తెలంగాణ వాదంతో 2014 లో అధికారం లోకి వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం 5 వేల మంది పేదలకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేసింది. ప్లాట్లు రద్దు అయ్యాయి అన్న కోపంతో ప్రజలు 2018లో ఎన్నికల్లో జగ్గారెడ్డి పై అభిమానం చాటుతూ ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారు. జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ టిఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడంతో ప్లాట్ల వ్యవహారం ముందుకు సాగకుండా వ్యూహాత్మకంగా అడ్డుకున్నది.

### జగ్గారెడ్డి మున్సిపల్ ఎన్నికల వాగ్దానంపై ఆసక్తి

గడిచిన ఏడు నెలల క్రితం సదాశివపేటలో జగ్గారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార పర్వంలో సదాశివపేట గాంధీ చౌక్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో జగ్గారెడ్డి కేవలం 6 నెలల్లో సదాశివపేటలోని 26 వార్డుల్లో ప్రతి వార్డు కు 100 ప్లాట్ల చొప్పున నిరుపేదలకు 2,600 ప్లాట్లు ఇచ్చి తీరుతానని, ప్లాట్లతో పాటు ప్రతి వార్డుకు అభివృద్ధి కోసం రూ. 8 కోట్లు సీఎం రేవంత్ రెడ్డి తో కేటాయింపజేస్తానని జగ్గారెడ్డి గాంధీ విగ్రహం సాక్షిగా వాగ్దానం చేశారు. జగ్గారెడ్డి వాగ్దానాన్ని గౌరవిస్తూ సదాశివపేట ప్రజలు సదాశిపేట మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించారు. మొత్తం 26 వార్డుల్లో మెజార్టీ కౌన్సిలర్ స్థానాలను కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసి సరిగ్గా 9 నెలల సమయం పూర్తి కావడం ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15 రోజున సంగారెడ్డికి రావడం, లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించడం, అదే సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించను న్నారు. సంగారెడ్డి తో పాటు సదాశివపేట పట్టణాలపై సీఎం రేవంత్ రెడ్డి వరాలు కురిపిస్తారని ప్రజలు ఆశతో ఉన్నారు.

### సీఎం ప్లాట్ల ప్రకటన కోసం ఎదురుచూపులు

సంగారెడ్డి లో సీఎం సభలో సదాశివపేట వాసుల ప్లాట్ల పంపిణీ హామీ కూడా ఉంటుందని సదాశిపేట నిరుపేదలు భావిస్తున్నారు దాంతోపాటు జగ్గారెడ్డి ఇచ్చిన మరో మున్సిపల్ ఎన్నికల హామీ ప్రతి వార్డుకు రూ. 8 కోట్ల నిధుల మంజూరు ప్రకటన కూడా సీఎం రేవంత్ రెడ్డి నోటి నుండి వస్తుందని సదాశిపేట ప్రజలు ఆశతో ఉన్నారు ఇదే జరిగితే సదాశిపేట పట్టణవాసుల ఆనందం రెట్టింపు అవడం ఖాయం సదాశిపేట పట్టణంలో 50 ఏళ్లుగా ఏ నాయకుడు ప్లాట్లు పంపిణీ చేయలేదు. 2012 సంవత్సరంలో ఎమ్మెల్యేగా జగ్గారెడ్డి పంపిణీ చేసిన 5000 ప్లాట్లు రద్దు కావడం ఇప్పుడు జగ్గారెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి రద్దయిన ప్లాట్లను పంపిణీ చేస్తారని సొంత ఇల్లు లేని నిరుపేద ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

### ఇచ్చిన హామీలు తీరుస్తే, ప్రజలు, శ్రేణుల్లో నయా జోష్

సదాశివపేట పట్టణం నుంచి సీఎం బహిరంగ సభకు తరలి వెళ్లేందుకు భారీగా ప్రజలు సిద్ధమవుతున్నారు. సీఎం నోట ప్లాట్లు, రూ.8 కోట్ల నిధుల ప్రకటన వస్తే సంబరాలు చేసేందుకు ఇటు ప్రజలు అటు కాంగ్రెస్ శ్రేణులు ఉవ్విళ్లూరుతున్నారు.

# గత పాలనతో బేరీజు వేయండి

మొదటిపేజీ తరువాయి..

రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు.డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు. ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా



నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర పక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు

## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

మొదటిపేజీ తరువాయి..

హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## యూరియా యాప్‌పై రైతుల ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి..

చేస్తూ సిబ్బందిని బంధించి సింగిల్ విండో కార్యాలయానికి తాళం వేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కొత్తపల్లి సింగిల్ విండో లో 400 బస్తాల యూరియా బ్యాగ్ లు అందుబాటులో ఉంటాయని అధికారులు సందేశం అందించారు. యాప్ టెక్నికల్ సమస్య కారణంగా ఓపెన్ కాక పోవడంతో అన్నదాతలు ముకుమ్మడిగా సింగిల్ విండో కార్యాలయం దగ్గరికి దూసుక వచ్చి ఆందోళనకు దిగారు. యాప్ లో టెక్నికల్ సమస్య ఉందని సిబ్బంది పొంతన లేని సమాచారం ఇవ్వడంతో వారిని కార్యాలయంలో బంధించి తాళం వేసి ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుంకోజి శ్రీనివాస్, గ్రామ రైతులు ఉన్నారు.

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర

మొదటిపేజీ తరువాయి..

తదితరులతో కలసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం, ఆ అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని వినోద్‌కుమార్ అన్నారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తే తెలంగాణ రైతాంగం, సాగునీటి రంగం, రాష్ట్ర భవిష్యత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఎంపీలందరూ వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి , తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ వేదికగా కూడా ఈ అంశంపై తెలంగాణ తరఫున గట్టిగా పోరాడాలని కోరారు.

**DOCUMENT LOST**

Notice is hereby given to the general public that Sri. Baddam Akhil Reddy, S/o. Vijaya Bhaskar Reddy, Age: 25 years, Occ.: Agriculture, R/o H.No. 4-90/2, Dhannur-B Village, Boath Mandal, Adilabad District, has lost/misplaced the following original Registered Gift Deed documents, which are not traceable despite diligent search: Regd. Gift Deed Doc. No. 25/2020, dated 08.12.2020, registered at SRO, Boath, pertaining to land in Sy.No.113/E/2, admeasuring Ac.2.20 Gts., owned and possessed by Sri. Baddam Akhil Reddy.Regd. Gift Deed Doc. No. 26/2020, dated 08.12.2020, registered at SRO, Boath, pertaining to land in Sy.No.113/E/1, admeasuring Ac.2.20 Gts., owned and possessed by his brother Sri. Baddam Arun Reddy.

If anyone finds the said original documents or has any valid claim/objection over the same, kindly restore/inform us within 7 days from the date of publication of this notice.

**Contact: 8185869562**

## యువత ఉత్సాహం చూస్తుంటే.. భారత్ విశ్వగురుగా మారడం ఖాయం

: ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ..




**మామడ ఆగస్టు 14 (ప్రజాజ్యోతి) :** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్మల్‌లో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్న ఈ ర్యాలీలో విద్యార్థులు, Gen Z యువత, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో నిర్మల్ మార్మోగింది. యువత దేశం, ధర్మం కోసం సమయాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. యువత ఉత్సాహం చూస్తుంటే భారత్ విశ్వగురురుగా మారడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య, స్రవంతి రెడ్డి, తక్కల రమణ రెడ్డి, కరిపే విలాస్, మెడిసెమ్మ రాజు, రాజేశ్వర్ రెడ్డి, డీజేపీ జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు , పట్టణ బీజేపీ కౌన్సిలర్లు, మామడ మండల బిజెపి సీనియర్ నాయకులు ఎలిగేటి వంశీకృష్ణ నేతతో పాటు వడ్ల నరేష్, సెల్యం భీమేష్ మరియు విద్యార్థులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్





**మంచిర్యాల, 13, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంచిర్యాల జోన్ పరిధిలోని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వివిధ నేరాలకు సంబంధించి స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్టేషన్‌లో అమలు చేస్తున్న 5ఎస్ విధానాన్ని పరిశీలించి, అన్ని రికార్డులను క్రమ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించిన కమిషనర్.. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిగతులు, నిందితుల అరెస్టులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి పెండింగ్‌కు గల కారణాలను ఇన్స్పెక్టర్ అశోక్, ఎస్ఐ సంతోష్‌లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను సమీక్షించారు. విధుల్లో ఉన్న బ్లూకోట్స్ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి వారి స్థాన వివరాలు, విధుల నిర్వహణపై ఆరా తీశారు. కోర్టు విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి వారి విధులు, ఆ రోజు కోర్టులో విచారణకు ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ కనిపించేలా పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణకు అధికారులు, సిబ్బంది సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఏమాత్రం ఉపేక్షించవద్దని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బందికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ తనిఖీలో శ్రీరాంపూర్ ఇన్స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

## అమరుల త్యాగ ఫలితమే భారతదేశానికి స్వాతంత్ర్యం

– బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి




**మంచిర్యాల, 13, ఆగస్టు (ప్రజా జ్యోతి) :** అమరుల త్యాగ ఫలితమే భారతదేశానికి స్వాతంత్ర్యం అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల పట్టణంలో తిరంగ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ముఖ్య అతిథిగా హాజరుకాగా, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ కొనసాగింది. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు 500 మీటర్ల భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేయడం వల్లే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. నేడు ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే దేశ సరిహద్దుల్లో నిరంతరం కాపలా కాస్తున్న సైనికుల త్యాగాలే కారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తితో అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ మహత్తర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పెద్దపల్లి పురుషోత్తం, పురుషోత్తం జాజు, కొయ్యల ఎమాజీ, దుర్గం అశోక్, గోలి రాము, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, పట్టి వెంకట కృష్ణ, ఆకుల అశోక్ వర్ధన్, ఆడే ప్రేమ్ సింగ్, పచ్చ స్వప్న రాణి, బేర సత్యనారాయణ, రాచర్ల సంతోష్, పానుగంటి మధు, బొడ్డు రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రావణ మాసం సందడి.. శుభకార్యాలకు శ్రీకారం

- పెండ్లికి భాజా మోగింది.ఏకం కానున్న వందలాది జంటలు
- పూజలు, వ్రతాలతో పాటు వివాహ ముహూర్తాలకూ ప్రాధాన్యం
- వేలాది కుటుంబాలకు ఉపాధి, వ్యాపారాలకు ఊతం






**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 12, (ప్రజాజ్యోతి) :** హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన మాసాల్లో శ్రావణ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. పూజలు, వ్రతాలు, అభిషేకాలు, దైవారాధనలకు పెట్టింది పేరైన శ్రావణ మాసం ఈ ఏడాది ఆగస్టు 13 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 11 వరకు కొనసాగనుంది. తెలుగు రాష్ట్రాల్లో శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతం, నాగపంచమి, రక్షాబంధన్, శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రావణ శుక్రవారాల పూజలు వంటి అనేక పర్వదినాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. దక్షిణాయనం ప్రారంభమైన అనంతరం శుభకార్యాలకు అనుకూలమైన ముహూర్తాలు లభించే కాలంలో శ్రావణ మాసానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పండితులు చెబుతున్నారు. పంచాంగాన్ని బట్టి నిర్ణయించే ముహూర్తాల ఆధారంగా వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలు నిర్వహించేందుకు కుటుంబాలు సన్నద్ధమవుతున్నాయి. అయితే వివాహ ముహూర్తాలు ప్రాంతం, పంచాంగం, తిథి, నక్షత్రం, కుటుంబ సంప్రదాయాలను బట్టి మారుతాయని స్థానిక పురోహితులు ,జ్యోతిష్యులు ఇందూర్తి ఆచార్య కళ్యాణ్ సూచిస్తున్నారు.

**వివాహాల వల్ల అనేక రంగాలకు ఉపాధి :** ఒక వివాహం అంటే కేవలం వధూవరుల కుటుంబాలకు మాత్రమే సంబంధించిన వేడుక కాదు. దాని వెనుక అనేక వృత్తులు, వ్యాపారాలు, కుటుంబాల జీవనోపాధి ముడిపడి ఉంటుంది. పెళ్లి ముహూర్తాలు ప్రారంభం కాగానే కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ సంస్థలు, వంటవాళ్లు, పూల అలంకరణదారులు, డెకరేటర్లు, పురోహితులు, నాదస్వర కళాకారులు, ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, మేకప్ కళాకారులు, టైలర్లు, చీరలు--బట్టల వ్యాపారులు, బంగారు నగల దుకాణాలు, పండ్ల--పూల వ్యాపారులు, స్వీట్స్--బేకరీలు, రవాణా రంగం, ప్రింటింగ్ ప్రెస్‌లు, ఆహ్వాన పత్రికల తయారీదారులు తదితర అనేక రంగాలకు పని లభిస్తుంది. ఒక్కో వివాహం ద్వారా ప్రత్యక్షంగా 15--20కు పైగా రకాల వృత్తి విభాగాలు లబ్ధి పొందే అవకాశం ఉండగా, వాటిపై ఆధారపడిన అనేక కుటుంబాలకు పరోక్షంగా ఆదాయం సమకూరుతుంది. పెద్ద వివాహాల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పూలు, కూరగాయలు, పండ్లు, పాల ఉత్పత్తులు, మిఠాయిలు, చేనేత వస్త్రాలు, అలంకరణ సామగ్రి వంటి స్థానిక ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుంది.

**భక్తి.. సంప్రదాయం.. ఆర్థిక చైతన్యం :** శ్రావణ మాసం ఆధ్యాత్మికంగా ఎంత విశిష్టమైనదో, సామాజికంగా కూడా అంతే ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. మహిళలు శ్రావణ శుక్రవారాల్లో లక్ష్మీదేవిని పూజిస్తూ కుటుంబ సౌభాగ్యం, సంతానం, ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం వ్రతాలు ఆచరిస్తారు. శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తుల రాకతో దేవాలయాల పరిసరాల్లో పూలు, పూజా సామగ్రి, ప్రసాదాల విక్రయాలు కూడా పెరుగుతాయి. మరోవైపు వివాహాలు, ఇతర శుభకార్యాల సందడితో చిన్న వ్యాపారులు, కళాకారులు, కార్మికులు, సేవా రంగంలోని వారికి ఆదాయ అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల శ్రావణ మాసం ఒకవైపు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తూనే మరోవైపు సంప్రదాయ వృత్తులకు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు చైతన్యం తీసుకువచ్చే మాసంగా నిలుస్తోంది. శ్రావణ మాసంలో దైవభక్తితో పాటు సంప్రదాయాలను పాటిస్తూ, పంచాంగ నిపుణుల సూచనల మేరకు శుభకార్యాలను నిర్వహించుకోవాలని పండితులు.

## గోదాదేవి... భక్తి పరిమళం వెదజల్లిన దివ్య నాచ్చియార్!

- నేడే గోదాదేవి (ఆండాళ్) తిరునక్షత్రం ప్రత్యేకం
- కిటకిటలాడనున్న వైష్ణవ దేవాలయాలు
- ప్రేమనే ప్రపత్తిగా, ప్రపత్తినే పరమపథంగా చూపిన మహాభక్తురాలు
- ఇందూర్తి ఆచార్య కళ్యాణ్. అద్యాపకులు, జ్యోతిష్యులు, పురోహితులు





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, (ప్రజాజ్యోతి) :**

భక్తి అంటే ఏమిటి?
భగవంతుని ఆరాధించడం అంటే కేవలం పూజలు చేయడమేనా?
శరణాగతి అంటే ఏమిటి?

ఈ ప్రశ్నలకు తన జీవితాన్నే సమాధానంగా నిలిపిన దివ్య మహాభక్తురాలు శ్రీ గోదాదేవి (ఆండాళ్). భగవంతునిపై అనన్యమైన ప్రేమతో, సంపూర్ణ శరణాగతితో జీవించి, తన భక్తి పరిమళాన్ని యావత్ ప్రపంచానికి పంచిన గోదాదేవి తిరునక్షత్రం శ్రీవైష్ణవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పర్వదినంగా భావించబడుతుంది.

**తులసీవనంలో లభించిన దివ్య వరం :** "కర్కటే పూర్వఫల్గున్యాం తులసీకాననోద్భవాం , పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీ రంగనాయకీమ్." శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తులవారు భగవంతునికి పూలమాలలు సమర్పిస్తూ భక్తితో జీవించేవారు. ఒక రోజు ఆయనకు తులసీవనంలో దివ్యమైన బాలిక దర్శనమిచ్చింది. ఆమెను దైవప్రసాదంగా భావించి తన కుమార్తెగా పెంచారు. ఆ బాలికే తరువాత గోదాదేవి, ఆండాళ్ గా జగద్విఖ్యాతురాలైంది.

చిన్ననాటి నుంచే గోదాదేవి హృదయం శ్రీమన్నారాయణునిపైనే నిలిచింది. స్వామివారినే తన జీవిత పరమలక్ష్యంగా భావించింది. ఆమెకు భౌతిక జీవితంలోని ఆకర్షణల కంటే భగవంతుని సాన్నిధ్యమే అత్యంత ప్రియమైనది.

ముందుగా తాను ధరించి, స్వామికి సమర్పించిన మాల : విష్ణుచిత్తులవారు ప్రతిరోజూ స్వామివారికి సమర్పించేందుకు పూలమాలలు తయారు చేసేవారు. అయితే గోదాదేవి ఆ మాలను ముందుగా తాను ధరించి, అద్దంలో చూసుకుని, తరువాత స్వామివారికి సమర్పించేది.

ఒక రోజు ఈ విషయం విష్ణుచిత్తులవారికి తెలిసి బాధపడ్డారు. తాను ధరించిన మాలను భగవంతునికి ఎలా సమర్పిస్తారని భావించి, కొత్త మాలను తయారు చేసి సమర్పించారు. అయితే స్వామివారు ఆ మాలను స్వీకరించలేదు.

గోదాదేవి ధరించిన మాలనే తనకు ప్రీతికరమని భగవంతుడు తెలియజేశాడు అందుకే ఆమెకు "సూడిక్కొడుత్త నాచ్చియార్" అనే విశిష్టమైన పేరు వచ్చింది.

ఇక్కడ భక్తి యొక్క ఒక గొప్ప రహస్యం దాగి ఉంది. భగవంతునికి సమర్పించిన వస్తువుకంటే, దాని వెనుక ఉన్న నిష్కల్మషమైన ప్రేమ ఆయనకు ప్రీతికరం.

ముప్పై పాశురాల్లో మధురమైన భక్తి : ఆండాళ్ రచించిన తిరుప్పావైలోని 30 పాశురాలు శ్రీవైష్ణవ భక్తి సాహిత్యంలో అమూల్యమైన ఆధ్యాత్మిక సంపద. ధనుర్మాసంలో ప్రతి రోజు ఒక పాశురాన్ని పారాయణం చేసే సంప్రదాయం నేటికీ విశేషంగా కొనసాగుతోంది.

తిరుప్పావై కేవలం పాశురాల సమాహారం కాదు. అందులో భక్తి ఉంది, ప్రపత్తి ఉంది, సత్సంగం ఉంది, లోకక్షేమం ఉంది ,భగవంతుని పట్ల అనన్యమైన ప్రేమ ఉంది.

"ఆళి మళై కణ్ణా..." అంటూ వర్షాలు సమృద్ధిగా కురిసి, సమస్త జీవులు సుఖసంతోషాలతో ఉండాలని ఆండాళ్ ప్రార్థించిన తీరు ఆమె భక్తి ఎంత విశాలమైనదో తెలియజేస్తుంది.

తనకోసం మాత్రమే కాకుండా సర్వలోక క్షేమాన్ని కోరిన భక్తి గోదాదేవి (ఆండాళ్) భక్తి.

**ప్రేమలోనే శరణాగతి :** గోదాదేవి (ఆండాళ్) రచించిన నాచ్చియార్ తిరుమొళిలో భగవంతుని పొందాలనే ఆమె తపన మరింత స్పష్టంగా కనిపిస్తుంది. శ్రీమన్నారాయణుడే తన జీవిత పరమగమ్యమని భావించిన ఆమె, తన మనసును పూర్తిగా భగవంతుని పాదాల వద్ద సమర్పించింది.

అందుకే గోదాదేవి (ఆండాళ్) జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది.

భగవంతుని చేరుకోవడానికి భక్తి మాత్రమే కాదు ఆ భక్తిలో సంపూర్ణమైన విశ్వాసం, ప్రేమ, శరణాగతి ఉండాలి.

నేటి తరానికి గోదాదేవి (ఆండాళ్) సందేశం

కాలం మారింది. జీవన విధానం మారింది. సాంకేతిక ప్రపంచం మనిషిని ఎంతగానో ముందుకు తీసుకెళ్లింది. కానీ మనశ్శాంతి కోసం, జీవితం యొక్క పరమార్థం కోసం మనిషి వెతుకుతూనే ఉన్నాడు.

ఇలాంటి సమయంలో గోదాదేవి (ఆండాళ్ )జీవితం నేటి తరానికి ఎంతో విలువైన సందేశాన్ని అందిస్తుంది.

భక్తి అంటే మూఢనమ్మకం కాదు.
భక్తి అంటే భయంతో చేసే ఆరాధన కాదు.
భక్తి అంటే భగవంతునిపై నమ్మకం, ప్రేమ, శరణాగతి.
గోదాదేవి (ఆండాళ్)తన జీవితంతో ఇదే సత్యాన్ని చాటిచెప్పింది.

ప్రతి ఇంటా తిరుప్పావై పరిమళించాలి

గోదాదేవి (ఆండాళ్) తిరునక్షత్రోత్సవం కేవలం ఒక ఉత్సవంగా ముగియకుండా, ప్రతి ఇంటా తిరుప్పావై పాశురాల పారాయణం జరగాలి. పిల్లలకు గోదాదేవి చరిత్రను తెలియజేయాలి. మన సంస్కృతి, సంప్రదాయాలు, దివ్యప్రబంధ సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి.

ఆండాళ్ తల్లి చూపిన భక్తి మార్గంలో నడుస్తూ, భగవంతునిపై విశ్వాసంతో, సమాజ శ్రేయస్సును కోరుకుంటూ జీవించడమే ఆమెకు మనం సమర్పించగల నిజమైన భక్తి.

"గోదాదేవి కృపాకటాక్షాలతో ప్రతి హృదయంలో భక్తి పరిమళించాలి. ప్రతి ఇంటా శాంతి, సౌభాగ్యం నెలకొనాలి. సర్వలోకాలకు మంగళం కలగాలి." ఆండాళ్ దివ్య తిరువడిగలే శరణం!

## నిర్మల్‌లో ఘనంగా తిరంగా ర్యాలి





- వందేమాతరం, భారత్ మాతాకీ జై అనే నినాదాలతో మార్మోగిన పట్టణ వీదులు
- దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది
- శాసనసభ్యులు, బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, (ప్రజాజ్యోతి) :** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని దేశం ధర్మం కోసం యువత తమ సమయాన్ని కేటాయించాలని స్థానిక శాసనసభ్యులు బీజేఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోడి పిలుపుమేరకు నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా " కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలో గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీ అత్యంత వైభవంగా జరిగింది. ఈ ర్యాలీలో పాఠశాల, కళాశాలల విద్యార్థులు యువకులు, బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో జాతీయ జెండాలు పట్టుకొని దేశభక్తిని చాటుకున్నారు. "వందేమాతరం " "భారత్ మాతాకీ జై " అనే నినాదాలతో పట్టణ వీధులన్నీ మార్మోగాయి. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభమై బస్టాండ్, అంబేద్కర్ చౌక్, వివేకానంద చౌక్ వరకు ఘనంగా కొనసాగింది. ఈ ర్యాలీ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ , స్వామి వివేకానంద విగ్రహాలకు ఎమ్మెల్యే తో పాటు, బిజెపి నాయకులు పూలమాలలు వేసి దేశభక్తిని చాటుకున్నారు.

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరంగా ర్యాలీలో యువత అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. యువత ఉత్సాహం చూస్తుంటే ఈ దేశం తప్పకుండా విశ్వ గురువుగా అవతరిస్తుందని తన విశ్వాసాన్ని వెలువచ్చారు.ఈ దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో పెరగాలని అన్నారు. భారత దేశంలో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించిన గొప్పతనం మన ప్రధాని నరేంద్ర మోడీ దేనని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలని సూచిస్తూ యువతతో ప్రతిజ్ఞ చేయించారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- మున్సిపల్ కమిషనర్ రవిబాబు
- నిర్మల్‌లో మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం
- నిబంధనలు పాటించని దుకాణాలు సీజ్



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 13, (ప్రజాజ్యోతి) :** ప్లాస్టిక్ వాడకం తప్పు అని ఇకముందు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ రవిబాబు అన్నారు . నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలపై గురువారం మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ గ్లాసులు వినియోగించడం తప్పు అని వాటిని స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలను సీజ్ చేసి మూసివేశారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు , ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకూడదని ఇప్పటికే ఎన్నోసార్లు వ్యాపారస్తులకు తెలిపినప్పటికీ, ఇంకా కొందరు పట్టించుకోకపోవడంతో, ఈ ప్రత్యేక డ్రైవులు చేపట్టి తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా దీనికి సహకరించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత కరువు


- విద్య, వైద్యం పేదలకు నేటికీ అందని ద్రాక్షగానే మిగిలాయి
- ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



**మంచిర్యాల, 13, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** 79 ఏళ్ల స్వాతంత్ర భారతావనిలో దేశ అభివృద్ధికి కార్మికులు, కష్టజీవులు తమ శ్రమను ధారపోస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత అందకపోవడం దురదృష్టకరమని ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. సిపిఐ ప్రజా పోరు యాత్రలో భాగంగా మంచిర్యాల ఐబీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సంపదను సృష్టించేది కార్మికుల శ్రమేనని, అయితే ఆ సంపదలో కార్మికులకు న్యాయమైన వాటా దక్కడం లేదని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కార్మికుల వేతనాలు అందుకు అనుగుణంగా పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి కనీస వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులుగా ఉండాల్సినప్పటికీ, నేటికీ పేదలు, సామాన్య ప్రజలకు అవి అందని ద్రాక్షగానే మిగిలాయని మేకల దాసు విమర్శించారు. ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలను అవలంబించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులకు తగినన్ని నిధులు కేటాయించి మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, కనీస వేతనాలు, సామాజిక భద్రత, విద్య, వైద్యం, ఉపాధి హక్కుల కోసం ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ ప్రజా పోరు యాత్ర ద్వారా ప్రజల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని మేకల దాసు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలిందర్ అలీఖాన్, జోగుల మల్లయ్య, రేగుంట చంద్రశేఖర్, మిరియాల రాజేశ్వరరావు, దేవి పోచన్న, చాడ మహేందర్ రెడ్డి, ఇలవేని సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

– జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ ఆగష్టు 13 ప్రజాజ్యోతి :** ఈ నెల 15న నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకలకు హాజరయ్యే ప్రముఖులు, అధికారులు, ప్రజలు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేదిక అలంకరణ, షామియానాలు, కుర్చీలు, సౌండ్ సిస్టం, స్టాళ్ల ఏర్పాటు స్థలం, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల కోసం మైదానాన్ని సిద్ధం చేయాలన్నారు. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంతకు ముందు పరేడ్ మైదానానికి చేరుకున్న కలెక్టర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు నదీమ్, సురేష్, సిద్దిక్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విలీనాన్ని విరమించాలి

- 'శక్తి' శాఖలో కలపొద్దు.. అధ్యాపకులు, సిబ్బంది డిమాండ్

వనపర్తి, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి' శాఖలో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది డిమాండ్ చేశారు.



గురువారం వనపర్తిలోని కె.డి.ఆర్. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఉద్యోగుల అభిప్రాయాలు తీసుకోకుండా ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. విలీనంతో ఉద్యోగుల సర్వీసు, పదోన్నతులపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలకు ఏఐసీటీఈ గుర్తింపు కొనసాగించేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, సంబంధిత వర్గాలతో సమగ్రంగా చర్చించిన తర్వాతే విలీనంపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# గంజాయి,డ్రగ్స్ నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక చర్యలు

**డాగ్ స్క్వాడ్‌తో గ్రామాల్లో విస్తృత తనిఖీలు స్కూళ్లు, కిరాణా దుకాణాలు, హోటళ్లలో సోదాలు**

**యువత భవిష్యత్తును కాపాడటమే ముఖ్య లక్ష్యం**

గద్వాల (ప్రజా జ్యోతి) ఆగస్టు 13: గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం ఉదయం జోగులాంబ గద్వాల పూడూరు ఎర్రవల్లి,విరపురం ఇతర గ్రామీణ ప్రాంతాల్లోగం







జాయి,డ్రగ్స్ వినియోగం మరియు అక్రమ రవాణానుఅరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలుచేపట్టింది.ఇందులో భాగంగా డాగ్ స్క్వాడ్ సహాయంతో గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ముఖ్యంగా స్కూలు విద్యార్థులు,యువత గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ముందస్తు చర్యలుతీసుకోవడంతో పాటు,గ్రామాల్లో మత్తు పదార్థాల ఆనవాళ్లను గుర్తించినిర్మూలించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా పోలీసులు తెలిపారు.గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, హోటళ్లు,పాఠశాలలు తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలునిర్వహించారు.విద్యార్థులు,యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకుసమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# కె.జి.బి.వి.ల్లో సివిల్ పనులను గడువులోగా పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కె.జి.బి.వి.) చేపడుతున్న



సివిల్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కె.జి.బి.వి.ల్లో చేపడుతున్న సివిల్ పనుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఇ డబ్ల్యూ ఐ డి సి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, కె.జి.బి.వి. ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడలపై అప్రమత్తంగా ఉండాలి

- ఓటీపీ నుంచి డిజిటల్ అరెస్ట్ వరకు.. సైబర్ మోసాలపై విద్యార్థులకు ఎస్పీ హెచ్చరిక : ఎస్పీ జానకి

-"సురక్షా కా తిరంగా – స్టే అలెర్ట్ స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్" సందేశంతో విద్యార్థులకు అవగాహన

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థులు, యువత సైబర్ భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు తెలిపారు. నకిలీ పెట్టుబడి పథకాలు, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ మోసాలు, కొరియర్ ఫ్రాడ్, లోన్ యాప్ మోసాలు, క్యూ ఆర్ కోడ్ మోసాలు, ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో మోసాలు, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ అరెస్ట్ వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక లాభాలు వస్తాయని చెప్పే అనుమానాస్పద పెట్టుబడి

**గురికావద్దు :**

"డిజిటల్ అరెస్ట్" పేరుతో సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి తాము పోలీసులు, సీబీఐ, ఈడీ లేదా కోర్టు అధికారులమని పరిచయం చేసుకుని భయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. పోలీసులు వీడియో కాల్ ద్వారా ఎవరినీ అరెస్ట్ చేయరని స్పష్టం చేశారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడ చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. అనంతరం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో






మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ వి డి సి కళాశాలలో గురువారం సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ జానకి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, సోషల్ మీడియా, డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతోందని, అదే సమయంలో సైబర్ నేరగాళ్లు కూడా కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని పథకాలను నమ్మవద్దని తెలిపారు. ఏదైనా సంస్థ లేదా యాప్ ద్వారా పెట్టుబడికి సంబంధించిన ప్రతిపాదన వచ్చినప్పుడు దాని అధికారికతను, ప్రభుత్వ అనుమతులను, సంబంధిత ఆర్థిక నియంత్రణ సంస్థల అనుమతులను ముందుగా నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారిని నమ్మి డబ్బులు చెల్లించవద్దని, లాటరీ, గిఫ్ట్, క్యాష్‌బ్యాక్, కస్టమర్ కేర్ తదితర పేర్లతో వచ్చే అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు**

**మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి:**

సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం కుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, ఏటీఎం కార్డు వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయకూడదని, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదని విద్యార్థులకు సూచించారు. రూపొందించిన సైబర్ భద్రత అవగాహన వీడియోలను విద్యార్థులకు ప్రదర్శించారు. సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న తాజా విధానాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ముగింపులో "సురక్షా కా తిరంగా – స్టే అలెర్ట్ స్టే అవేర్, స్టే సైబర్ సేఫ్" సందేశంతో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

చిన్నంబావి, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి): చిన్నంబావి మండల కేంద్రంలోని కొప్పునూరు, అయ్యవారి పల్లి, లక్షి పల్లి గ్రామాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్ధారణ క్షేత్ర సందర్శన పరిశీలించారు. ప్రయోగాల్లో పంట ఎదుగుదల, ఎరువులకు పంట స్పందనను నమోదు చేశారు. నానో ఎరువులను సిఫారసు చేసిన మోతాదులో, పంట దశకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు.కలుపు నివారణ మందులను





నిర్వహించారు. కేంద్రం వనపర్తి సమన్వయకర్త, శాస్త్రవేత్త ఎస్.నవత, ఏఈఓ సుబహన్ పాష, చెరుకు క్షేత్ర అధికారి అప్సర్ పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో సాగవుతున్న మొక్కజొన్న, ఉల్లి, చెరకు, కంది పంటలను పరిశీలించారు.క్షేత్రాల్లో పంటల ఎదుగుదల, పోషక లోపాలు, కలుపు, చీడపీడల ఉనికి, నేల పరిస్థితులను పరిశీలించి రైతులతో చర్చించారు. మొక్కజొన్నలో కలుపు నివారణ, సమతుల్య పోషకాల వినియోగం, నానో ఎరువుల వాడకంపై సూచనలు చేశారు. పంట ఆరోగ్యాన్ని కాపాడేందుకు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు.మొక్కజొన్నలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరీక్షలను పంట, కలుపు మొక్కల దశకు అనుగుణంగా మాత్రమే వాడాలని, మోతాదు, పిచికారీ సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఉల్లి, చెరకు, కంది పంటల్లోనూ అవసరమైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు తమ పంటల్లో ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురాగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన పరిష్కారాలను సూచించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దిగుబడులు పెంచుకోవడంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.శాస్త్రవేత్తలు వెంట వ్యవసాయ విస్తారనాధికారి, రైతులు, తదితరులు, ఉన్నారు.

# గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సౌకర్యాలు కల్పించాలి

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ): దేవరకద్ర మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ జూనియర్ కళాశాల, హాస్టల్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల, హాస్టల్‌లోని వంటగది పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మౌలిక వసతులు, హాస్టల్‌లోని వివిధ సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, విద్యా



ప్రమాణాలు, హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలు, అవసరాలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని, హాస్టల్‌లో అవసరమైన మౌలిక వసతులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల విద్యా, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో దేవరకద్ర ఎం.పి.ఓ, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ఫిర్యాదు

నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజా జ్యోతి): నారాయణపేట, వికారాబాద్ జిల్లాల పరిధిలో చేపడుతున్న మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలు,



అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లు గురువారం లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నారాయణపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఏం.ఎన్.కే.ఎల్.ఐ.ఎస్ లో ముఖ్యంగా నారాయణపేట మండలం పేరపల్ల గ్రామ శివారులో చేపట్టిన భూముల సేకరణలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెల్సుందని, ముఖ్యంగా దొంగ పాస్ బుక్ లతో నష్ట పరిహారం ఎత్తుకునేందుకు కాంగ్రెస్ నాయకులు పన్నాగం పొందేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పక్కా సమాచారం ఉందన్నారు. అంతే కాకుండా పేరపల్ల శివారులోని జయమ్మ చెరువులో నీరు నిల్వ చేయడం వల్ల కొంత మంది రైతులకు సంబంధించి భూములు కొల్పోకున్న, భూములు కోల్పోతున్నట్లు పేర్కొనడం, సర్వే నంబర్లు ఒక చోట ఉంటే భూములు ఒక చోట ఉన్నట్లు అధికారులు చెప్పడం రైతులను అయోమయానికి గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్టు పనుల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విచారణలో అవినీతి, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు తేలితే సంబంధిత అధికారులపై, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ప్రతి రూపాయి ప్రజాధనం సక్రమంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లోకాయుక్త విచారణ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాలని వారు కోరారు.

# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

**శానాయపల్లి, అమ్మపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి): గ్రామాల సర్వతోముఖాభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం రేవల్లి మండలం శానాయపల్లిలో నూతన గ్రామపంచాయతీ, మహిళా సమైక్య భవనాలను ప్రారంభించారు. మహిళా సంఘాలకు భవనం ఉపయోగకరంగా ఉంటుందని, మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. శానాయపల్లిలో మిద్దె శేషమ్మ, సవాయి రేణుక కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొని లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యమన్నారు. పెద్దమందడి మండలం అమ్మపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి, మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు పూర్తిచేసుకున్న పుట్టమాని రజిత–బాలరాజ్, శెట్టి జ్యోతి–బస్వరాజ్, ఎం.సుజాత–యాదయ్య, చిన్నగుంట రామేశ్వరమ్మ–ఆంజనేయులు, బుడగ జంగం కృష్ణవేణి–సీతారాములు కుటుంబాల గృహప్రవేశాల్లో పాల్గొన్నారు. వారికి నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో తమ సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ప్రభుత్వ భవనాలు, మహిళా సంఘాల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కె వెంకటేష్, వైస్ చైర్మన్ మంద సత్యశిలారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మాదాపురం పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ



**దేవరుప్పుల ఆగస్టు 13, (ప్రజాజ్యోతి):** దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన విద్యావేత్త, డీఎస్పీ లకావత్ దేవేందర్ నాయక్ సుమారు రూ.30 వేల విలువైన స్పోర్ట్స్ యూనిఫామ్‌లను, అలాగే క్లాస్ ఫస్ట్ విద్యార్థులకు బ్లేజర్స్ ను గురువారం పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు దేవేందర్ నాయక్ తెలిపారు. తాను పుట్టి పెరిగిన గ్రామానికి తన వంతుగా ఏదైనా మంచి చేయాలనే సంకల్పంతో పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లను అందించినట్లు చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా మాదాపురం పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను తనవంతుగా అందిస్తానని దేవేందర్ నాయక్ హామీ ఇచ్చారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్య పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు గ్రామస్తులు, యువత, పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు రావాలని కోరారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్న గ్రామ యువతను, సర్పంచ్ పంజాల శ్రీధర్ ను, విద్యార్థుల తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతారని పేర్కొన్నారు. కాగా ఈ యూనిఫామ్‌ల పంపిణీతో విద్యార్థుల్లో ఆనందం నెలకొంది. పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సుమారు రూ.30 వేల విలువైన యూనిఫామ్‌లను అందించిన దేవేందర్ నాయక్‌కు గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు, విద్యావంతులు, యువత ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని, సమాజంలో విద్య పట్ల మరింత బాధ్యతాయుతమైన వాతావరణాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నల్ల లలిత, మాదాపురం గ్రామ సర్పంచ్ పంజాల శ్రీధర్, లకావత్ తండా సర్పంచ్ భాగ్య నాయక్, డాక్టర్ ప్రీతి దయాల్, ఏఏపిసి చైర్మన్ వర్రె వసంత, డోనర్ బిల్లా రమేష్, వర్రె సతీష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధరావత్ రామ్ సింగ్, మడికొండ ఎల్లయ్య, లకావత్ తండా మాజీ ఉపసర్పంచ్ భూక్య శ్రీను, కొంగరి బిక్షపతి, లకావత్ రవి, లకావత్ గోపికృష్ణ, లకావత్ కిషన్, జవాజి రాములు, ఉపాధ్యాయులు సుర్జిత్, జీవన్, నరసింహులు, శ్రీనివాస్ బాబు, ధనలక్ష్మి, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

- ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి దేశభక్తిని చాటుదాం
- డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి







**నర్సంపేట ఆగస్టు 13 (ప్రజా జ్యోతి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు మనం ఇక్కడ కలవడానికి కారణం ఒకటే మన త్రివర్ణ పతాకం! ఈ జెండా కేవలం 3 రంగుల గుడ్డ కాదు. ఇందులో భగత్ సింగ్ త్యాగం ఉంది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాటం ఉంది. స్వామి వివేకానంద గారి స్ఫూర్తి ఉంది. ఈ జెండా కోసం లక్షల మంది ప్రాణాల త్యాగ ఫలితమే అని అన్నారు. ఇది బీజేపీ కార్యక్రమం కాదు. ఇది 140 కోట్ల భారతీయుల కార్యక్రమం. కులం, మతం పక్కనపెట్టి ప్రతి ఇంటికి జెండా చేర్చే బాధ్యత మనదే. విద్యార్థులు చదువుతో పాటు దేశాన్ని కూడా ప్రేమించాలి. సరిహద్దులో మన సైనికులు మన కోసం కాపలా కాస్తున్నారు. వారికి రుణం తీర్చుకోవడానికి ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేద్దాం-దేశభక్తిని చాటుదాం అని పిలుపునిచ్చారు. నర్సంపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే నెంబర్ 1 గా నిలవాలని ఆకాంక్షించారు. ఆగస్టు 13 నుండి 15 వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై గర్వంగా జాతీయ జెండా ఎగరవేసి ఫోటో తీసి హర్ ఘర్ తిరంగ్ అని సోషల్ మీడియాలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కటకం అశోక్



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 13 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కటకం అశోక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నాకు ఈ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతుగా అహర్నిశలు కష్టపడి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. నూతన అధ్యక్షుడిగా నియమితులైన కటకం అశోక్ కు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత



**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 13 (ప్రజాజ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్న 7 క్వింటళ్ల పిడిఎస్ బియ్యాన్ని మహాదేవపూర్ పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. నిందితులుబొమ్మ గణపతి, హనుమల గణపతి లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

**అభివృద్ధి పనుల పురోగతిపై క్షేత్రస్థాయి పరిశీలించిన బల్దియా కమిషనర్ టి.వెంకన్న**





**వరంగల్ సిటీ, ఆగస్టు13(ప్రజాజ్యోతి) :** నగర పరిధిలోని కమర్షియల్ భవనాల యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని సూచించారు. గురువారం నగరంలోని హన్మకొండ పరిధిలో ఫైర్ సేఫ్టీ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీకి సంబంధించి ఎర్రగట్టుగుట్ట వద్ద ఉన్న షైన్ పాఠశాలతో పాటు భీమారంలోని ఎస్ఎస్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ పరికరాలను కమిషనర్ పరిశీలించారు. అగ్ని ప్రమాదాల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా పరికరాలు అందుబాటులో ఉన్నాయా, అవి నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేశారా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరికరాల ఏర్పాటు, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బల్దియా ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టి పూర్తిచేసిన 22వ డివిజన్‌లోని సుజిత్‌సింగ్‌నగర్, 13వ డివిజన్‌లోని ఎం.హెచ్.నగర్‌లో నిర్మించిన సీబిట్ కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ప్రక్రియ కోసం పనుల నాణ్యత, పురోగతి తదితర వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 19వ డివిజన్ పరిధిలోని సొసైటీ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణ పనులను కూడా కమిషనర్ పరిశీలించారు. అలాగే కరీమాబాద్, బట్టల బజార్ ప్రాంతాల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతి, నాణ్యత, బిల్లుల చెల్లింపునకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసి, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జిల్లా ఫైర్ అధికారి శంకర్ లింగం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ బాబు, డిప్యూటీ ఇంజనీర్ రంగారావు, స్టేషన్ ఫైర్ అధికారి రాజేశ్వర్ రావు, అసిస్టెంట్ ఇంజనీర్లు మురళీకృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి
# అధికారులు తక్షణమే స్పందించాలి



- ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు
- బల్దియా కమిషనర్ టి.వెంకన్నతో కలిసి 14వ డివిజన్ సమస్యలపై సమీక్ష
- డివిజన్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన స్థానికులు
- సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తాం
- బల్దియా కమిషనర్ టి.వెంకన్న

**వరంగల్ సిటీ, ఆగస్టు 13(ప్రజాజ్యోతి):** ప్రజా సమస్యల పట్ల అధికారులు తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు సూచించారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 14వ డివిజన్‌లో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారంపై గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. బల్దియా కమిషనర్ టి.వెంకన్నతో కలిసి ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు సమావేశంలో పాల్గొని, డివిజన్‌లోని సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు శానిటేషన్, ఇంజినీరింగ్, శ్మశానవాటికలు, తాగు నీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ తదితర సమస్యలను ఎమ్మెల్యే, కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నగరంలో సమగ్ర భూగర్భ డ్రైనేజీ (యూజీడి) వ్యవస్థ ఏర్పాటుకు ముఖ్యమంత్రి పెద్దఎత్తున నిధులు కేటాయించారని, అందులో సింహభాగం తన నియోజకవర్గానికి, ముఖ్యంగా 14వ డివిజన్‌కు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కబ్జాల నియంత్రణకు చర్యలు చేపట్టామని తెలిపారు. తన నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో విలీన గ్రామాలు ఉన్నాయని, మడికొండ, హసన్‌పర్తి, మామునూరు ప్రాంతాల్లో పేద, సామాన్య ప్రజలు అధికంగా నివసిస్తున్నారని పేర్కొన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో ఇళ్లలోకి మురుగునీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిగణించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే సూచించారు. బల్దియా కమిషనర్ టి.వెంకన్న మాట్లాడుతూ, 14వ డివిజన్‌లో గుర్తించిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ఇంజినీరింగ్‌కు సంబంధించి 62 పనులు మంజూరు కాగా, 39 పనులు పూర్తయ్యాయని, 8 పనులు పురోగతిలో ఉన్నాయని, మరో 8 పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. మిగిలిన పనులు అగ్రిమెంట్ దశలో ఉన్నాయని తెలిపారు. స్థానికులు ప్రస్తావించిన వీధి దీపాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని, శానిటేషన్ వాహనాలకు డ్రైవర్లను త్వరితగతిన నియమించి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. 2020-21లో నిర్వహించిన సర్వేలో జరిగిన పొరపాట్ల కారణంగా నీటి సరఫరా లేకపోయినా బిల్లులు వస్తున్న సమస్య తమ దృష్టికి వచ్చిందని, దీనిని సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్మశానవాటికకు సంబంధించిన సమస్యను కూడా యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని తెలిపారు. ఇంటి నంబర్ల కేటాయింపుపై కమిషనర్ వివరిస్తూ, ప్రస్తుతం ఉన్న నంబర్లకు సంబంధించిన నోటరీ పత్రాలు సమర్పించిన వారికి హోల్డర్ నంబర్లు కేటాయిస్తున్నామని, పూర్తి స్థాయి ఇంటి నంబర్ల కేటాయింపుపై ప్రభుత్వం నుంచి నిర్ణయం రావాల్సి ఉందన్నార నగరంలో ముంపు సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందని కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, వెటర్నరీ వైద్యులు గోపాల్‌రావు, ఎంహెచ్‌ఓ డా. రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంతోష్‌బాబు, ఏసీపీ ఖలీల్, డీఈలు, ఏఈలు, స్థానిక డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను
# పకడ్బందీగా పూర్తి చేయాలి

**పైలాన్ నిర్మాణ పనులు, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి సీతక్క**





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లాలో సిఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ,శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లాలో ఈనెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని, నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని గురువారం మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు,జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రికి





ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రిసీతక్క మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తు గానే పూర్తి చేయాలని అధికారులను సూచించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగ వంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు,గుత్తేదారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన జిల్లా కలెక్టర్ భవన సముదాయం

పరిశీలించిన మంత్రి సీతక్క, భవనంలోని వివిధ విభాగాలు,కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుద్ధ్యం, విద్యుత్,తాగునీరు, రహదారులు, పార్కింగ్‌తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. సిఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని,అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మధ్యాహ్నాశీ సమయంలో మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క - సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం వన దేవతల సన్నిధి నుండి రాష్ట్ర వ్యాప్తంగాఅర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు సంతృప్తస్థాయిలో పింఛన్లు అందించే కార్యక్రమాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఆగస్టు 31 తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారిని గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం జరు గుతుందని అన్నారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి ములుగు జిల్లా కేంద్రానికి చేరుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంచా యతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేలకోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్‌ను ములుగు గట్టమ్మసమీపంలో ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పెద్ద ఎత్తున రహదారుల పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, నూతన సమీకృత జిల్లా కార్యాలయాలసముదాయం ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసే సభలో ప్రజలను,అభిమానులను ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. సిఎం పర్యటనను విజయ వంతం చేసేందుకు ములుగు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా ప్రతి నిధులు,నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ,సంపత్ రావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి వీరాభిమాని గూగులోతు గౌస్ నాయక్ జన్మదిన వేడుకలు



**రాయపర్తి ఆగస్టు 13 ప్రజాజ్యోతి :** రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రియా శిష్యుడు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి విరాభిమాని గూగులోతు గౌస్ నాయక్ జన్మదినము సందర్భంగా గురువారం రాయపర్తి మండలం జయరాం తండా (ఎస్) గ్రామానికి చెందిన మండల పార్టీ యూత్ నాయకులు గురువారం బీ ఆర్ ఎస్ మండల పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి, శాలువతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మాజీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, సర్పంచ్ లు రమేష్, లావుడ్యా నరేష్ మండల పార్టీ నాయకులు కంది ప్రభాకర్, అశ్రఫ్ పాషా, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, ఐత రవి, బాలు నాయక్, నేతవత్ శ్రీధర్, నేతవత్ రాజా సతీష్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కత్తి వెంకటస్వామి గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి మదన్ మోహన్ రావు



**నర్సంపేట ఆగస్టు 13 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ఉద్యమ సహచరుడు, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి గౌడ్ సతీమణి కత్తి భవాని మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి మదన్ మోహన్ రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కత్తి భవాని మృతి పట్ల ఎర్రబెల్లి మదన్ మోహన్ రావు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను కలిసి వారి బాధను పంచుకున్నారు. ఈ సందర్భంగా కత్తి వెంకటస్వామి గౌడ్ కి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుండి కత్తి వెంకటస్వామి గౌడ్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మదన్ మోహన్ రావు గారు, కత్తి భవాని మృతి కుటుంబానికే కాకుండా వారి ఆత్మీయులు, సన్నిహితులకు తీరని లోటని అన్నారు. కత్తి భవాని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని కోరారు.



## ముల్కనూరులో 10వ శతాబ్దపు దాన శాసనం

తెలుగుకన్నడ లిపి.. కన్నడ భాషలో శాసనం
ముల్కనూరు పూర్వనామం 'ముల్కలూరు'గా వెల్లడి
చారిత్రక ఆనవాళ్లను సంరక్షించాలని చరిత్రకారుల సూచన



**భీమదేవరపల్లి ఆగస్టు 13 ప్రజా జ్యోతి :** మండలంలోని ముల్కనూరులో పదో శతాబ్దానికి చెందిన దాన శాసనం వెలుగులోకి వచ్చింది. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు గుడికందుల కిషోర్, సిద్ధమల్ల రమేష్ చేపట్టిన చారిత్రక అన్వేషణలో ఈ శాసనం బయటపడింది. మహిళా సహకార డెయిరీ వెనుక భాగంలో ఉన్న చిన్న రాతిగుండుపై శాసనంతోపాటు పలు శిల్పాలు చెక్కి ఉన్నాయి.

**శివలింగం.. నంది.. గణపతి శిల్పాలు :**

రాతిపై గణపతి, వేదికపై శివలింగం, పక్కనే నంది, మహిషాసురమర్ధిని అర్ధ ఉబ్బెత్తు శిల్పాలు ఉన్నాయి. వాటిపైన సూర్యచంద్రుల ప్రతిమలు, ఆపై పెద్ద అక్షరాలతో శాసనం చెక్కి ఉంది. అయితే మనుషుల కార్యకలాపాల కారణంగా శాసనంలోని అక్షరాలు కొంతమేర చెరిగిపోయాయి. భక్తి, విశ్వాసాల కారణంగా శిల్పాలు, శాసనం ఇప్పటికీ నిలిచి ఉన్నట్లు చరిత్ర పరిశోధకులు తెలిపారు. రాతికి ఎదురుగా మొక్కుబడి నాగశిలలు కూడా ఉన్నాయి.

**కన్నడ భాష.. తెలుగుకన్నడ లిపి :**

పదో శతాబ్దానికి చెందిన తెలుగుకన్నడ లిపి, కన్నడ భాషలో ఈ శాసనం ఉన్నట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ వెల్లడించారు. కళ్యాణి చాళుక్యుల పాలనాకాలంలో 'సమధిగత పంచ మహాశబ్ద' ప్రశస్తి కలిగిన మహాసామంతుడు బిజ్జన.. సంవత్సరం తెలియని చైత్ర శుద్ధ ద్వాదశి రోజున ముల్కలూరులో నీర్నేలును దానం చేసినట్లు శాసనం ద్వారా మితంగా తెలుస్తోందన్నారు. శాసనంలో 'ముల్కలూరు' ప్రస్తావన ఉండటంతో ముల్కనూరు గ్రామానికి ఆ పేరు పదో శతాబ్దానికి ముందే ఉన్నట్లు నిర్ధారణ అవుతోందని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న శాసనాన్ని అధికారులు సంరక్షించాలని హరగోపాల్ కోరారు.

# నకిరేకల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

నకిరేకల్ ఆగస్టు 13 ప్రజా జ్యోతి
నకిరేకల్: అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు నకిరేకల్ మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల సూర్యవర్ ఆధ్వర్యంలో నకిరేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది.






ఈ సందర్భంగా జడ్జి మంజుల సూర్యవర్ మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి యువజనులని, తమ హక్కుల కోసం అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. దేశ భవిష్యత్తు, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ విధులను అంకితభావంతో నిర్వర్తించాలని, దేశాన్ని అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పిస్తూ, ఉచిత న్యాయ సహాయం (ఫ్రీ లీగల్ ఎయిడ్) అందుబాటులో ఉందని, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. మంచి కెరీర్‌ను ఎంచుకుని, నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుని కష్టపడి చదివి అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి ముద్దసాని నీలిమ మాట్లాడుతూ.. జీవితంలో ఏదైనా సాధించాలంటే మన నడవడిక, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులను గౌరవించాలని, ప్రతిరోజూ వార్తాపత్రికలు చదువుతూ సాధారణ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొండా యాదగిరి, అక్కినేపల్లి వీరస్వామి, నూకల మల్లేశం, పగడాల మీరా మనోహర్, బల్లెం ఉదయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. రాములు, ఉపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది సింగం సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రి పంపిణీ

సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):
సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రూ.10000 వేల రూపాయల విలువైన క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు.క్రీడల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్





యువ నాయకులు దిర్శనపు సందీప్ ఈ క్రీడా సామగ్రిని పాఠశాలకు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు.క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ,జట్టు స్ఫూర్తి,ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు.పాఠశాలకు అందించిన క్రీడా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు.క్రీడా సామగ్రిని అందించిన దిర్శనపు సందీప్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకయ్య,కే.చంద్రశేఖర్ రెడ్డి,వెంకట్,మురళీధర్,సిద్ధు (పీ.ఈ.టీ),విజయ లక్ష్మి ,మధు తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశ నమూనాలో క్రిష్ణవేణి విద్యార్థులు



రామన్నపేట ఆగస్టు 13( ప్రజా జ్యోతి):
ఈ నెల 15 న జరుగబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు గురువారం వినూత్నంగా తమ పాఠశాల ప్రాంగణంలో భారత దేశ నమూనాను ప్రదర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులచే వినూత్నంగా నిర్వహించిన భారత దేశ నమూనా ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. వినూత్నంగా ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి అభినందించారు.

## ప్రధానోపాధ్యాయుడి సేవలు అభినందనీయం

15 ఏళ్లుగా విద్యార్థుల అభ్యున్నతికి కృషి

రిటైర్మెంట్ పొందిన శ్రీనివాస్‌శెట్టికి ఘన సన్మానం

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్

చౌటుప్పల్, ఆగస్టు 13 ( ప్రజా జ్యోతి ):
విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేసిన ప్రధానోపా



ధ్యాయుడు శ్రీనివాస్ శెట్టి సేవలు మరువలేనివని సర్పంచ్ గిర్కటి నిరంజన్‌గౌడ్ అన్నారు. దండు మల్కాపూర్ మండల పరిషత్ పాఠశాలలో 15 ఏళ్లపాటు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్‌శెట్టిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. విద్యాబోధనతోపాటు విద్యార్థులకు నైతిక విలువలు నేర్పిన శ్రీనివాస్‌శెట్టిని అభినందించారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన మహిళలు.. పులకించిన అన్నారం

తుంగతుర్తి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):
మండల పరిధిలోని అన్నారం గ్రామంలో సంస్కృతిలో భాగమైన గ్రామ దేవత అయిన ఊర ముత్యాలమ్మ కు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో గురువారం బోనాలు సమర్పించుకున్నారు. ఆషాడ మాసం సందర్భంగా గ్రామస్తులు మహిళలు కుటుంబ సమేతంగా కొత్త కుండలో బోనాలు తయారు చేసి సాంప్రదాయ వస్త్రాదానతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు .మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాల కుండలను ఇంటి వద్ద నుంచి డప్పు వాయిద్యాల నడుమ గ్రామ దేవత అయిన ఊర ముత్యాలమ్మకు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఊరి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించి ఎలాంటి అంటువ్యాధులు రాకుండా గ్రామ దేవత కాపాడాలని భక్తితో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ సరిత, వార్డు సభ్యులు బింగి వెంకటేశ్వర్లు ,మరికంటి శ్యాంప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ దొంగరి శ్రీనివాస్, వేణు కృష్ణమూర్తి చిత్తలూరి సోమశేఖర్, సోమయ్య, స్థానిక ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



## దళిత డిక్లరేషన్ అమలు చేయాలి

తుంగతుర్తి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అధికారం రావడం కోసం చేవెళ్ల లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఖర్గే తో 12 కీలక అంశాలతో దళిత డిక్లరేషన్ విడుదల చేసి అధికారం వచ్చి మూడేళ్లయిన అమలకు నోచుకోలేదని టిఆర్ఎస్ పార్టీ దళిత నాయకులు మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో దళిత డిక్లరేషన్ అమలు చేయాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చి ఇంత కాలమైనా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంపై మండిపడ్డారు. దళిత గిరిజన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తామన్న ఆకర్షణీయమైన హామీలు అప్పట్లో యువతకు ఎన్నో ఆశలు రేకెత్తించాయని అన్నారు. దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతామని కాంగ్రెస్ పార్టీ నమ్మించి వమ్ము చేసిందని మండిపడ్డారు.అంబేద్కర్ అభయహస్తం పేరుతో చెప్పిన రూ.12 లక్షల ఆర్థికసాయం కాని, విదేశాల్లో చదువుకున్న దళిత విద్యార్థులకు 20లక్షల ఓవర్సీస్ స్కాలర్షిప్ లాంటి ఏ ఒక్క వాగ్దానాన్ని కూడ అమలు చేయలేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొట్లాది రూపాయలు నిధులు విడుదల చేసి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆడుకుంటామని చెప్పి మూడేండ్ల అయిన ఒక్కరూపాయి కూడ కార్పొరేషన్ ద్వారా దళిత కుటుంబాలకు అందించలేదని అన్నారు. రాష్ట్రం లో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకపోగా ప్రజాపాలన పేరుతోదగా పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీకి భవిష్యత్ లో తగిన గుణ పాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, వెంపటి,



గానుగ బండ సర్పంచులు తప్పట్ల ఎల్లయ్య, మాతంగి వెంకటమ్మ కరుణాకర్, మల్లెపాక రాములు,గోపగాని రమేష్ పూర్ణ నాయక్,వీరోజీ నాయక్. సుధాకర్ నాయక్,భాస్కర్,కదారిదాసు సోమయ్య, ప్రవీణ్, భాస్కర్, శ్రీనివాస్, రాములు,సోమేశ్, కరుణాకర్, విజయ్,శ్రవణ్.పరుశురాం,శ్యామ్,పోలేపాక రాజేష్, సాయి, పరమేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరోళ్ళను గ్రామదేవతల ఆలయాల వద్ద పూజారులుగా నియమించాలి

తుంగతుర్తి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):
గ్రామ దేవతల ఆలయాల వద్ద కుమ్మరోళ్ళను పూజారులుగా నియమించి వారికి ప్రభుత్వం తరపున నెలకు రూ.10 వేల గౌరవ



వేతనం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని మార్కండేయ భవనంలో తుంగతుర్తి మండలం లోని 16 గ్రామాల ప్రతినిధుల సర్వసభ్య సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడి కూడ జయంత రావు నాయకత్వంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ మరియు రాష్ట్ర కమిటీ సూచనల మేరకు జిల్లా కన్వీనర్ చలిగంటి వెంకటేష్ సమక్షంలో నియోజకవర్గ ఇన్చార్జి కోటమర్తి శ్రీనివాస్ అధ్యక్షతన 16 గ్రామాల కమిటీల తోపాటు యువజన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తుంగతుర్తి మండల అధ్యక్షునిగా మద్దికుంట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, యూత్ అధ్యక్షునిగా మద్దికుంట్ల రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ... గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారని తెలిపారు. గ్రామ దేవతల ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించే బాధితులను కుమ్మరోళ్ల కు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వాన్ని మరింత బలోపేతం చేయవచ్చు అన్నారు. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు ఆలయ వ్యవస్థలను సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వీరేంద్ర, కోదాడ ఇన్చార్జి రామారావు, ఖమ్మంపాటి మధుసూదన్, నాగయ్య, లింగయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

21న జిల్లా కేంద్రాల్లో ధర్నా.. 29న హైదరాబాద్ లో భారీ నిరసన..
స్పందించకుంటే 'చలో అసెంబ్లీ'

తుంగతుర్తి, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి):
ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తుంగతుర్తి మండల



కేంద్రంలో గురువారం తహసీల్దార్ దయానందం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ నాయకులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి, తుంగతుర్తి మండల అధ్యక్షుడు మల్లెపాక రవీందర్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు కాచుగల్ల నవీన్ ప్రసాద్ మాట్లాడుతూ... పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు దాటినా ప్రభుత్వం జాప్యం చేస్తోందని అన్నారు. పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించి 2023 జూలై నుంచి అమలు చేయాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించాలని, ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారిన అశాస్త్రీయమైన జీవో 25ను రద్దు చేయాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, స్థానికత కోల్పోయిన 317 జీవో బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని అన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 21న జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని, 29న హైదరాబాద్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని నాయకులు హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ మండల నాయకులు మందడి సూర్యప్రకాష్, బీవనపల్లి శ్రీనివాస్, కోట స్టాలిన్, గుండ్ల ఆంజనేయులు, కొమ్ము గణేష్, జీడి అనిల్‌కుమార్, బరిగెల నవీన్‌కుమార్, బానోతు రవికుమార్, గుండగాని సుధాకర్, దరావత్ బాలాజీ, షేక్ హబీబ్, ఉబ్బపల్లి బాలయ్య, చంద్రకళ, బండారు మమత, మేధం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిపల్లి మండలంలో సర్వసభ్య సమావేశం

దేవరకొండ, గుడిపల్లి, ఆగస్టు 13,(ప్రజా జ్యోతి):
దేవరకొండ నియోజకవర్గంలోని గుడిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు రమావత్ బాలు నాయక్ ని గుడిపల్లి గ్రామ సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుడిపల్లి గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి,



వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన ప్రధాన అంశాలు తాగునీటి ఇబ్బందులు గ్రామంలోని కొన్ని కాలనీలలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అదనపు పైప్‌లైన్లు, కొత్త బోర్‌వెల్స్ మంజూరు చేయాలి.వైకుంఠధామం పనులు: గ్రామంలో నిర్మిస్తున్న శ్మశానవాటిక (వైకుంఠధామం) పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన మిగిలిన నిధులను విడుదల చేయాలి.సి సి రోడ్లు మరియు మురుగునీటి కాలువలు, గ్రామ అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడానికి నూతన సిసి రోడ్లతో పాటు, మురుగునీరు నిల్వ ఉండకుండా కొత్త డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలి.రహదారుల కనెక్టివిటీ పొలాలకు వెళ్లే దారులను మరియు పక్క గ్రామాలను కలిపే లింక్ రోడ్లను బాగు చేయాలి.ఎమ్మెల్యే బాలు నాయక్ హామీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి అందించిన వినతిపత్రంపై ఎమ్మెల్యే బాలు నాయక్ సానుకూలంగా స్పందించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గుడిపల్లి గ్రామంలో ఉన్న సమస్యల తీవ్రతను బట్టి, ప్రాధాన్యత క్రమంలో తగిన నిధులు మంజూరు చేసి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని సర్పంచ్‌కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గుడిపల్లి గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ జలదోపిడీపై కాంగ్రెస్ మౌనం వీడాలి

వరుణ యాగాలు మాని కృష్ణా జలాలను కాపాడండి
మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ హెచ్చరిక

హాలియా,ఆగస్టు13(ప్రజా జ్యోతి) శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోతున్నా, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించడం అత్యంత శోచనీయమని నాగార్జునసా



గర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ విమర్శించారు. గురువారం హాలియా పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు ఆంధ్రా ప్రభుత్వం కృష్ణా జలాలను యథేచ్ఛగా దోచుకెళ్తుంటే కళ్ళు మూసుకున్న కాంగ్రెస్ పార్టీ,రైతు సంక్షేమం పేరిట నాగార్జునసాగర్ లో వరుణ యాగం చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని దుయ్యబట్టారు.కృష్ణా నదిలో కేవలం మిగులు జలాలను మాత్రమే పోతిరెడ్డిపాడు ద్వారా వాడుకునే హక్కుఆంధ్రప్రదేశ్ ఉందన్న విషయాన్ని గుర్తుచేస్తూ, నికర జలాలను తరలించే హక్కు వారికి లేదని స్పష్టం చేశారు. ఒప్పందం ప్రకారం 24 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే తీసుకెళ్లాల్సి ఉండగా,రోజుకు ఏకంగా 6 టీఎంసీల నీటిని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు.శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నిండకుండానే పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తే,భవిష్యత్తులో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరిపి నీటి అక్రమ తరలింపును అరికట్టాలని, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేయించేలా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులకు ఈ ప్రాంత రైతుల సంక్షేమం మరియు ప్రాంతీయ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే,వెంటనే శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించి అక్రమ నీటి తరలింపును అడ్డుకోవాలని ఆయన సవాల్ విసిరారు.లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.
ఈ సమావేశంలో బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కురాకుల వెంకటేశ్వర్లు,పిడిగం నాగయ్య, వడ్డే సతీష్ రెడ్డి,నల్గొండ సుధాకర్,వర్ర వెంకట్ రెడ్డి, కడమంచి శ్రీను,సురభి రాంబాబు,ఊర్లగొండ వెంకటయ్య,చిట్టీపోలు శ్రీనివాస్, చేగొండి కృష్ణ,కూరాకుల రవి యాదవ్,సైదా చారి,యడవెల్లి నాగరాజు కార్తీక్,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రచార జాత




కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాజ్యోతి) భిక్కనూరు మండలం గ్రామం కంచర్ల పెద్ద మల్లారెడ్డి చేరిన సిపిఐ ప్రచార జాత మరియు పాదయాత్ర గ్రామాలకు చేరడం జరిగింది. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్యఅతిథిగా రావడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంచిన నిత్యవసర ధరలను పెట్రోల్ గ్యాస్. మరియు ప్రైవేటు రంగాలను అప్పజెప్పిన ఎల్ఐసి బ్యాంకింగ్ రవాణా రంగాలను కేంద్ర ప్రభుత్వము బిజెపి ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని అన్నారు. ఇప్పటికే సామాన్య ప్రజలు బతికే పరిస్థితి లేదని పెంచిన ధరల వల్ల ప్రజలు ఇబ్బందుల గురవుతున్నారని అన్నారు. అదేవిధంగా రైతుల సమస్యలు రైతులకు గిట్టుబాటు ధర పండించిన పంటకు కనీస ధర నిర్ణయం కేంద్ర ప్రభుత్వం చేయాలని ఇప్పటివరకు ఎరువులను పంపిణీ చేయలేక రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో యువకులు చదువుకొని హైదరాబాద్ కేంద్రం వెళ్లిన ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మారిపోయారని కేంద్ర ప్రభుత్వము సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని అదేవిధంగా నల్లధనాన్ని తీసుకువస్తానన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు తెలియదని అదేవిధంగా బడా బాబులు అంబానీ ఆదాని లాంటి వారి ఆస్తులు రోజుకు పెరుగుతుంటే పేదల ప్రజల కనీసం ఉద్యోగులుగా పనిచేస్తున్న కార్మికులు పని గంటలు 10 గంటలు పని నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని గ్రామాల్లో ఉపాధి హామీ లాంటి చట్టాలను తీసివేయడం జరిగిందని పని లేక యువకులు రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అదేవిధంగా మహిళలకు మహిళా రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని గ్రామస్థాయి రైతులకు సిపిఐ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి. బాలరాజ్, జిల్లా నాయకులు దేవయ్య, ప్రవీణ్, సిద్ధిరాములు ,ఎల్లయ్య, రాజమణి, జంపయ్య, రేణుక, శారద, రాజమల్లు, నరసయ్య, రాజ్యం, సాయిలు, ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# కన్నాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాజ్యోతి) రామారెడ్డి మండల కేంద్రంలోని కన్నాపూర్,కన్నాపూర్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రోడ్లు,ప్రధాన బ్రిడ్జి సమస్యల పై ఎమ్మెల్యే మదన్మోహన్ రావు సహకారంతో ఫేస్ వన్ సర్వే కన్నాపూర్ కట్టమీద నుండి రామారెడ్డి మండలానికి వెళ్లే ప్రధాన దారి మరియు గర్గుల్ నుండి కన్నాపూర్, కన్నాపూర్ తాండ మీదగా కట్టేదిపు వరకు డాంబర్ రోడ్ సాంక్షన్ కావడం జరిగింది.కన్నాపూర్ వాగు పై బ్రిడ్జ్ సాంక్షన్ కావడం జరిగింది. దీనిలో భాగంగా కన్నాపూర్ సర్పంచ్ గొల్ల మహేష్ తండా సర్పంచ్ మంగి గోవింద్ నాయక్, పిఆర్ డిఈ బాల్ లింగం, ఏఈ సురేష్,వార్డు సభ్యులు ప్రశాంత్ హరీష్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చెన్నం శెట్టి రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు కన్నాపూర్ తండా ప్రజలు కృతజ్ఞతలు తెలుపడం జరిగింది.



# ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బాల్కొండ ఆర్సీ ప్రజా జ్యోతి ఆగస్టు 13 నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలో తాసిల్దార్ వినతిపత్రం అందజేసిన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ( యు.ఎస్.పి.సి )డిమాండ్ పాఠశాల విద్యలో నెలకొన్న తీవ్రమైన సమస్యలను, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యు.ఎస్.పి.సి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, భీమ్గల్ తహసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా యు.ఎస్.పి.సి నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ విద్యారంగంలో అస్పష్టమైన, అసంబద్ధమైన నిర్ణయాల వల్ల గందరగోళం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనేతర, ఆన్‌లైన్ పనులు, పాఠశాల సమయాల్లో నిరంతర శిక్షణల వల్ల ఉపాధ్యాయులు తరగతి గది బోధనకు దూరమవుతున్నారని తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు:**

పి ఆర్ సి అమలు డిఎ ల విడుదల:పి ఆర్ సి నివేదికను వెంటనే తెప్పించుకుని 01.07.2023 నుండి అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న 6 విడతల డీఏ (డి ఎ ) లను తక్షణమే విడుదల చేయాలి.పాత పెన్షన్ పునరుద్ధరణ: 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ ఆప్షన్ ఇవ్వాలి. సీపీఎస్ (సీపీస్ ) ను రద్దు చేసి, ఓపీఎస్ (ఓపిస్ ) ను పునరుద్ధరించాలి.బడుల మూసివేత నిర్ణయం ఉపసంహరణ: పాఠశాలల మూసివేత (27 వేల నుండి 4 వేలకు కుదింపు) ఆలోచనను విరమించుకోవాలి. +.రా.వీం.చీశీ. 25 ను సవరించి ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలి.బదిలీలు ఉ ప్రమోషన్లు: అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ఆగస్టు 15 లోపు విడుదల చేయాలి. వైద్య సౌకర్యాలు: టి ఎస్ సి పి ని బలోపేతం చేసి ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలు: సమగ్రశిక్ష, కేజీబీవీ / యు ఆర్ ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమం బేసిక్ పే వర్తింపజేయాలి. +.రా. 317 బాధితులకు న్యాయం: +.రా. 317 వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వెంటనే వారి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలి.

ప్రభుత్వం ఈ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

**ఆగస్టు 19: జిల్లా కేంద్రాల్లో భారీ ధర్నాలు**

ఆగస్టు 29: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వేలాదిమంది ఉపాధ్యాయులతో నిరసన ప్రదర్శన ఆ తర్వాతి దశలో అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా "ఛలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**కార్యక్రమంలో పాల్గొన్నవారు:**



ఈ కార్యక్రమంలో టి ఎస్ యు టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. మల్లేష్, డీటీఫ్ జిల్లా నాయకులు జి. ఈశ్వర్, ఎస్సీ ఎస్టీయూ జిల్లా నాయకులు పి. లింగయ్య, టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎం. జనార్దన్, డీటీఫ్ జిల్లా నాయకులు ఏ. రమేష్, మరియు నాయకులు టి. శ్రీనివాస్, కె. సత్యనారాయణ, ఎస్. భూమేశ్వర్, ఎస్. అశోక్, ఎన్. తిరుపతి గౌడ్, వై. భూమేశ్వర్, టి. ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

# మన ఆత్మగౌరవం మన తిరంగా జెండా: జిల్లాల శ్రీనివాస్

ఇందల్వాయి:(ప్రజాజ్యోతి) ఆగస్టు. 13 ఇందల్వాయి మండల కేంద్రంలో గురువారం తిరంగా బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జిల్లాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా బైక్‌లపై తిరంగా జెండాలను చేతబూని మండల కేంద్రంలోని ప్రధాన వీధులు, గల్లీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "మన







ఆత్మగౌరవం మన తిరంగా జెండా -- మన గర్వం మన భారతదేశం" అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని చాటుకున్నారు. ప్రతి ఒక్కరూ భారత జాతీయ జెండాను గౌరవించాలని జిల్లాల శ్రీనివాస్ కోరారు.మన ఆత్మగౌరవానికి ప్రతీక అయిన తిరంగా జెండాను ప్రతి భారతీయుడు గౌరవించి, దాని గౌరవాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ బైక్ ర్యాలీతో ఇందల్వాయి మండల కేంద్రంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.



# గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణ



హత్నూర 13 ఆగస్టు (ప్రజాజ్యోతి) కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ డిమాండ్ చేశారు.గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గీతన్నల చైతన్య బస్సు యాత్ర గురువారం నాడు సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌల్తాబాద్ కు చేరుకోగా మండల గౌడ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఆగస్టు 02 నుంచి 18 వరకు బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.గీతా కార్మికులకు 4వేల పెన్షన్, 10 లక్షల ఎక్స్గ్రేషియో ఇవ్వాలన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం 50 సంవత్సరాల పైబడిన గీతా కార్మికుల అందరికీ పెన్షన్ ఇవ్వాలని కోటి ఈతముక్కలకు నంబర్ వేసి రక్షించాలని కోరారు.ఈత చెట్లను చంపిన వారిపై కఠినంగా శిక్షించాలని, ప్రతి సొసైటికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని అన్నారు.గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని, రాష్ట్ర బడ్జెట్లో నీరాకు కేటాయించిన 25 కోట్లు, సంక్షేమం కోసం కేటాయించిన 67 ఏళ్ల కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి రోజు ట్యాంక్ బండి పై విగ్రహం ఏర్పాటు చేయాలని సర్వాయిపేట తాటికొండ ఖిలాసాపురం కోటాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండల గౌడ సంఘం నాయకులు ఆంజనేయులు గౌడ్, రాజాగౌడ్, దౌల్తాబాద్ ఉప సర్పంచ్ శేఖర్ గౌడ్,లక్ష్మణ్ గౌడ్, శేఖర్ గౌడ్, నాగ ప్రభు గౌడ్, వెంకటేష్ గౌడ్, ధనుంజయ్ గౌడ్, రవీందర్ గౌడ్, మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పది మీటర్ల జాతీయ
# జెండాతో జోగిపేటలో తిరంగాయాత్ర

అందోల్, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి): దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని చాటుతూ అందోల్--జోగిపేట మున్సిపాలిటీలో గురువారం భారీ తిరంగాయాత్రను ఘనంగా నిర్వహించారు. సుమారు పది మీటర్ల భారీ జాతీయ జెండాను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువత పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండా రెపరెపలాడుతుండగా దేశభక్తి నినాదాలతో పట్టణ పరిసరాలు మార్మోగాయి. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు మహేష్కర్ పావని మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సాధించి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశభక్తిని చాటేందుకు తిరంగాయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. దేశ ప్రజలందరూ దేశం, ధర్మం పట్ల అంకితభావంతో పనిచేస్తూ భారతదేశాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.దేశం కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తించడమే నిజమైన దేశభక్తి అని పేర్కొన్నారు. యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పవన్, ఆందోల్ నియోజకవర్గ కో-కన్వీనర్ మహేష్కర్ సుమన్, మాజీ అందోల్ అసెంబ్లీ కన్వీనర్ ప్రభాత్, ప్రధాన కార్యదర్శి మ్యాదరి పాపయ్య, యువమోర్చా నాయకులు, కొర్పోల్ సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, కార్తీక్ గౌడ్, రాంసాన్‌పల్లి మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి, రోళ్లపాడు మాజీ సర్పంచ్ నర్సింలు, సీనియర్ నాయకులు గుండెగల నరసింహులు, హరీష్, గణేష్, నరేష్, శ్రీనాథ్, సాయికుమార్, మాణిక్యం, ప్రశాంత్, సాయిరాం, వినీత్, నాగరాజుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# పీఆర్సీని ప్రకటించి వెంటనే అమలు చేయాలి

● ఆరు పెండింగ్ డీఏలను విడుదల చేయాలి ● సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
● తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ

కొండాపూర్ ప్రజా జ్యోతి పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు.ఎస్.పి.సి) రాష్ట్రశాఖ పిలుపు మేరకు కొండాపూర్ మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు దాటినా ప్రభుత్వం ఇంకా జాప్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పీఆర్సీ రిపోర్టును తెప్పించి అమలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలతో పాటు ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి, పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**ఆరోగ్య కార్డులు వెంటనే మంజూరు చేయాలి**

కొత్త ఆరోగ్య పథకం కోసం గత మూడు నెలలుగా ఉపాధ్యాయుల వేతనాల నుంచి 1.5 శాతం చొప్పున జమ



చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. వెంటనే ఆరోగ్య పథకం మార్గదర్శకాలను విడుదల చేసి, ఉపాధ్యాయులకు ఎలాంటి జాప్యం లేకుండా వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**సీపీఎస్‌ను రద్దు చేయాలి**

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు.సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాలను చెల్లించడంతో పాటు వారిని రెగ్యులరైజ్ చేసి వేతన స్కేళ్లు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి**

విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన జీవో 25ను సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

**ఆగస్టు 21న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు**

సమస్యల పరిష్కారం కోసం తదుపరి కార్యాచరణలో భాగంగా ఆగస్టు 21న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 29న ఇందిరా పార్క్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు యం. లక్ష్మయ్య యాదవ్, ఎస్. ప్రవీణ్ కుమార్, సంతోష్ కుమార్, జగన్నాథం, ఎల్. పుండరికం, నర్సింహులు, రవీందర్, వెంకటేశం, శ్రీనివాస్, వెంకయ్య, బాలకృష్ణ, రాఘవేంద్ర, సాంబశివుడు, ఆదిరాజు, అరవింద్, సంజీవయ్య, రాములు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 14న సుధీర్ జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 13: సుధీర్ 3వ జయంతిని పురస్కరించుకుని సుధీర్ ఫ్రెండ్స్ ఫౌండేషన్, నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బ్లడ్ డోనర్స్ వ్యవస్థాపకుడు ముజాహిద్ చిస్తీ తెలిపారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. ప్రతి ఏడాది సుధీర్ జయంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుధీర్ ఫ్రెండ్స్‌ను అభినందించారు. ఆగస్టు 14న నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. సేకరించిన రక్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారికి, జిల్లాలోని వివిధ ఏరియా ఆసుపత్రుల ద్వారా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి రక్తదానం చేయలేని వారు నారాయణఖేడ్‌లోనే నిర్వహిస్తున్న ఈ శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని నిర్వాహకులు కోరారు. ఒక్కరి రక్తదానం అత్యవసర సమయంలో ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉందని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. రక్తదాతలు రక్తదానానికి ముందు తగిన ఆహారం తీసుకుని శిబిరానికి రావాలని సూచించారు.సుధీర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమంలో యువత, స్వచ్ఛంద రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి శిబిరాన్ని విజయవంతం చేయాలని సుధీర్ ఫ్రెండ్స్ ఫౌండేషన్, నారాయణఖేడ్ బ్లడ్ డోనర్స్ నిర్వాహకులు కోరారు.





# గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయండి




మెదక్ (ప్రజాజ్యోతి) మానుకోట నుండి ట్యాంక్ బండ్ హైదరాబాద్ వరకు 2026 ఆగస్టు 2నుండి 18 తేదీ వరకు నిర్వహిస్తున్నరు గీతన్నల చైతన్య యాత్రలో భాగంగా బుధవారం రాత్రి ఏడు గంటలకు మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాకు చేరుకుంది.యాత్రను భాగంగా రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మేకపోతుల రమణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు రావడం జరిగింది.ఈ సందర్భంగా మెదక్ జిల్లా గౌడ సంఘం నాయకులు ఆరేళ్ళ జనార్దన్ గౌడ్ , మంగ రమేష్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించి ట్యాంక్ బండ్ పై విగ్రహం ప్రతిష్టించాలని మరియు నూతన కల్లు విధానం రూపొందించి తక్షణ సమస్యలు పరిష్కరించాలని ఉద్యమించాము. పెద్ద ఎత్తున సాగిన ఈ యాత్రలో గీత కార్మికులు అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక కోటి తాటి , ఈత వృక్ష సంపదను ప్రకృతి మనకు ప్రసాదించింది. వీటిపై ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో మార్పులు తీసుకువచ్చి గీత కార్మికుల ఉపాధి మెరుగుపరచాలి వృత్తిలో జరుగుతున్న ప్రమాదాల నివారించాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలు మనకు ఇచ్చిన హామీలు పెన్షన్ 4000 లు, 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలుచేయాలని వారు తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వన దుర్గ భవాని ప్రెస్ క్లబ్ నూతన కమిటీ




మెదక్ (ప్రజాజ్యోతి) మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో వనదుర్గ భవాని ప్రెస్ క్లబ్ నూతన కమిటీని అధికారికంగా ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాచారం చంద్రశేఖర్ ను వన దుర్గ భవాని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కమిటీ వివరాలు:**

- అధ్యక్షులు: నాచారం చంద్రశేఖర్
- గౌరవాధ్యక్షులు: రాజ్ కుమార్
- ఉపాధ్యక్షులు: అబ్రహం, తిగిట సాయిరాం, చింతల సిద్దు
- ప్రధాన కార్యదర్శి: ఎస్. రాము
- సహాయ కార్యదర్శులు: నరేష్ యాదవ్, సైఫదిన్
- కోశాధికారి: మహేష్
- ముఖ్య సలహాదారులు: ఆకుల పెంటయ్య, ఆంజనేయులు, జయరాజ్
- కార్యవర్గ సభ్యులు: సాయి గౌడ్, సందీప్ గౌడ్, డి. దుర్గయ్య, మధు, బిక్షపతి, సత్యానంద్

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నాచారం చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ కమిటీ తనను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.పత్రికా మిత్రులు, మీడియా మిత్రుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చంద్రశేఖర్ తెలిపారు. సమాజంలో జర్నలిజం పట్ల ఉన్న గౌరవాన్ని మరింత పెంపొందించే విధంగా, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతాయుతమైన పాత్రికేయ వృత్తికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు.తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న నూతన కమిటీ సభ్యులతో పాటు పత్రికా, మీడియా మిత్రులందరికీ మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

♦ ఇండ్లు లేని కార్మికులకు 120 గజాల స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

♦ ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి




కొమురవెల్లి, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):- హమాలీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ సిద్దిపేట జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కొమురవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఉమేష్‌కు యూనియన్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్తిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హమాలీ కార్మికులకు అనేక హామీలు ఇచ్చి, ప్రస్తుతం వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని హమాలీ కార్మికులందరికీ హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, రాష్ట్రంలోని హమాలీ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసి అసంఘటిత కార్మికులుగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ-శ్రమ్ పోర్టల్‌లో హమాలీ కార్మికుల పేర్లను నమోదు చేసి సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని, 55 సంవత్సరాలు పైబడిన కార్మికులకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఇండ్లు లేని హమాలీ కార్మికులకు ప్రభుత్వం 120 గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీ పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా హమాలీ కార్మికులందరికీ ప్రమాద బీమా, సహజ మరణ పరిహారం, ఆరోగ్య బీమా, విద్యా సహాయం, ప్రసూతి ప్రయోజనాలు కల్పించాలని సత్తిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు మెతుకు రమేష్, పుల్లంపల్లి సాయిలు, ఆరుట్ల రవీందర్, తేలు నరసింహులు, మలకని కనకయ్య, అల్దే స్వామి, దండు రవి, కృష్ణ, దొంతరపోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

♦ రసూలాబాద్ గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య

♦ దొంగతనం కేసు, అప్పుల బాధతో తీవ్ర మనోవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యుల వెల్లడి

కొమురవెల్లి, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):- మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన కొమురవెల్లి మండలకేంద్రంలో ని చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి మండలం బొప్పాయిపల్లి గ్రామానికి చెందిన తిగుళ్ల రజనీకాంత్ (31) కుటుంబ సభ్యులతో కలిసి కొమురవెల్లి జాతరలో పాల డెయిరీ కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చిన్నకోడూరు మండలానికి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడి వివాహం చేసుకున్నాడు. వీరికి ఐదు నెలల వయసున్న కుమార్తె ఉంది. కొద్దిరోజుల క్రితం కొమురవెల్లిలో జరిగిన ఓ దొంగతనం కేసులో రజనీకాంత్ ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు, ఈ కేసులో పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. గతంలో జరిగిన విషయాలను గుర్తు చేసుకుంటూ, అప్పుల బాధతో రజనీకాంత్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో కొమురవెల్లి మండలంలోని రసూలాబాద్ గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు మూడు రోజుల క్రితమే అతడు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేర్యాల మార్చురీకి తరలించారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి తల్లి, భార్యతో పాటు ఐదు నెలల కుమార్తె ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## అయినాపూర్ గ్రామ సమస్యల
# పరిష్కారం కోసం సీపీఎం పార్టీ ధర్నా

♦ తాగునీరు, వీధిలైట్లు, దోమల నివారణ, పాఠశాలల పరిశుభ్రతపై వినతి



కొమురవెల్లి, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):- మండలంలోని అయినాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ అయినాపూర్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు తేలు ఇస్తారీ మాట్లాడుతూ.. గ్రామంలో పలు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి తాగునీరు అందించాలి:**

గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను వెంటనే ప్రారంభించి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు.

**అన్ని వీధుల్లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలి:**

గ్రామంలోని అన్ని వీధులతో పాటు ప్రధాన చౌరస్తాలో ఎల్ఈడీ వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు రాత్రివేళల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

**దోమల నివారణకు చర్యలు చేపట్టాలి:**

గ్రామంలో దోమల బెడద తీవ్రంగా ఉందని, ప్రతిరోజూ రాత్రి వేళల్లో దోమల మందు పిచికారీ చేయాలని కోరారు.

**పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి:**

గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పరిశుభ్రత బాధ్యతను గ్రామ పంచాయతీ తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి అస్వస్థత కలగకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని సీపీఎం నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఉల్లంపల్లి సాయిలు, సున్నం యాదగిరి, కానుగుల రాజు, ఏనుగుల శీను, పబ్బోజు నవీన్, పాశం చంద్రయ్య, మల్ల అంజయ్యతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నంగునూరులో తిరంగా ర్యాలీ



నంగునూరు: ఆగస్టు13(ప్రజా జ్యోతి):- భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ నంగునూరు మండల అధ్యక్షుడు చౌడుచర్ల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నంగునూరు మండల కేంద్రంలో భారీ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ నంగునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమై పుర వీధుల గుండా బస్టాండు వరకు సాగింది. అక్కడి నుంచి తిరిగి ఉన్నత పాఠశాలకు చేరుకుంది. ర్యాలీలో విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు, యువత, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి "భారత్ మాతాకీ జై", "వందేమాతరం" వంటి నినాదాలతో నంగునూరు పుర వీధులను మార్మోగించారు. జాతీయ జెండాలతో అలంకరించిన ట్రాక్టర్లతో రైతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో రైతులు తమ ట్రాక్టర్లను తీసుకొచ్చి వాటికి జాతీయ జెండాలను కట్టి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్లపు రెడ్డి రజనీకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశం పట్ల ప్రతి ఒక్కరిలో బాధ్యతా భావం పెంపొందాలని చెప్పారు. యువత దేశ అభివృద్ధిలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. వందేమాతరం గీతానికి ప్రాధాన్యత కల్పిస్తూ పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం గొప్ప విషయమని రజనీకర్ రెడ్డి పేర్కొన్నారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత, జాతీయ భావాలను మరింత పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం కేవలం ఒక పండుగగా కాకుండా, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునే సందర్భంగా ప్రతి ఒక్కరూ భావించాలని ఆయన సూచించారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తిరంగా ర్యాలీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వాసరి యాదమల్లు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి, జేడిపల్లి రజనీకర్ రెడ్డి, తుపాకుల నరేశ్, సింహ కిశోర్, నారాయణ, రత్నాకర్ రెడ్డి, కత్తుల పరమేశ్వర్ రెడ్డి, పంగ నరసింహారెడ్డి, చిలకల తిరుపతిరెడ్డి, వస్తాదుల యాదగిరి, కట్కూరు భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరి వారితో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కిసాన్ మోర్చా ప్రతినిధులు, యువత, విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. జాతీయ జెండాలతో నంగునూరు ప్రధాన వీధుల్లో సాగిన ఈ తిరంగా ర్యాలీ దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచింది.

# సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలి

♦ ములుగు మండల అధ్యక్షులు విద్యాధర రెడ్డి



ములుగు, ఆగస్టు13 (ప్రజా జ్యోతి) సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్)ను పునరుద్ధరించాలని,ఉపాధ్యాయులకు రావలసిన 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ రవీందర్ రెడ్డి కి ములుగు మండల టిపిటిఎఫ్ అధ్యక్షుడు విద్యాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాలకు పోరాట కమిటీ పిలుపుమేరకు గురువారం ములుగు మండల మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా విద్యాధర రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు.25 జీవో ద్వారా ఎస్జిటి ఉపాధ్యాయులకు ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలలో తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు నెలల్లో పిఆర్సి అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు 2013 జూలై నుంచి రావలసిన పి ఆర్ సి ని వెంటనే అమలు పరచాలని,ఉపాధ్యాయులకు రావలసిన వెంటనే విడుదల చేయాలని విద్యారంగానికి ఉపాధ్యాయులకు సంబంధించిన 29 డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.మా డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించిన పక్షంలో ఈనెల 19న జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన డిమాండ్ పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్ యూసఫ్,ములుగు మండల జనరల్ సెక్రెటరీ రాజా నర్సింహులు,తారా సింగ్, శివకుమార్, సంతోష్, ప్రసాద్, సద్గుణం, శేషాచారి, నరసింహారావు, సమేత, శాంత, సునీత తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వైద్యానికైనా సిద్దిపేటకే..!

♦ 24 గంటల వైద్య సేవలంటూ ప్రచారం ఉత్తదేనా..?

♦ అత్యవసర వేళల్లో సిబ్బంది కరువు

♦ స్టాఫ్ నర్సులు లేక సెకండ్ ఏఎన్ఎంల పై భారం

♦ పాము, తేలు కాట్లకు కానరాని చికిత్స

♦ గర్భిణీలకు తప్పని తిప్పలు

♦ సిబ్బందిని భర్తీ చేయాలని ప్రజల డిమాండ్

చిన్నకోడూరు, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):- ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశించిన స్థాయిలో సేవలు అందించకపోవడంతో చిన్నకోడూరు ప్రజలు వైద్యం కోసం సిద్దిపేట వైపు పరుగులు తీస్తున్న పరిస్థితి నెలకొంది. గ్రామంలో ప్రభుత్వ దవాఖాన ఉన్నప్పటికీ చిన్నపాటి అనారోగ్యానికి సైతం సిద్దిపేట ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేను వస్తా బిడ్డో.. సర్కారు దవాఖానకు అన్న నాటి మాటల నుండి అమ్మో నేను రాను బిడ్డా సర్కారు దవాఖానకు అనే పరిస్థితికి చేరుకున్నాయనేది చెప్పక తప్పదు.

**స్టాఫ్ నర్సులు లేక సెకండ్ ఏఎన్ఎంలే దిక్కు..**

24 గంటల వైద్య సేవలు అందించాల్సిన ఆస్పత్రిలో రాత్రి వేళల్లో మెడికల్ ఆఫీసర్ తో పాటుగా స్టాఫ్ నర్సులు అందుబాటులో లేకపోవడంతో సెకండ్ ఏఎన్ఎంలు వారి స్థాయికి మించి వైద్యం చేస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి.కాగా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందకపోతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పాముతేలు కాట్లకూ సిద్దిపేటే దిక్కు...**

రాత్రి వేళల్లో ఎవరైనా పాము లేదా తేలు కాటుకు గురైతే తక్షణ వైద్య సేవలు, అవసరమైన చికిత్స అందాల్సి ఉంటుంది. అయితే ఆస్పత్రిలో రాత్రి వేళల్లో తగినంత సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో బాధితులను సిద్దిపేటకు తరలించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. విష ప్రభావం ఎక్కువగా ఉన్న సందర్భాల్లో సిద్దిపేటకు వెళ్లేలోపు పరిస్థితి విషమించిప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్షలాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రి భవనం నిర్మించి, 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. అత్యవసర సమయంలో రోగికి తక్షణ వైద్యం అందకపోతే ఆ సేవల ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**గర్భిణీలకు తప్పని తిప్పలు**

సాధారణ ప్రసవాలు జరగాల్సిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నైట్ డ్యూటీ డాక్టర్, స్టాఫ్ నర్సుల కొరత గర్భిణీలను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన గర్భిణీలు సైతం ప్రసవ సమయాల్లో సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఎదురయింది.

**ఉన్నతాధికారులు స్పందించాలి..**

ఆస్పత్రిలో అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటే స్థానికంగానే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉన్నప్పటికీ సిబ్బంది కొరత కారణంగా ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేయడంతో పాటు, రాత్రి వేళల్లోనూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

♦ సీఐటీయూ అనుబంధ హమాలీ సంఘం




చేర్యాల ఆగస్టు 13(ప్రజాజ్యోతి): హమాలీ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ అనుబంధ హమాలీ సంఘం చేర్యాల మండల నాయకులు బుచ్చెల్లి నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం చేర్యాల తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ... ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో,ఇతర ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం వివిధ రంగాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు వర్తించేలా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని,ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని,55 ఏళ్ల పైబడిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమాను రూ. 25 లక్షలకు పెంచాలని, ప్రభుత్వ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, హెల్త్ కార్డులు ఇచ్చి అన్ని వైద్య సదుపాయాలతో పాటు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏలుగు రవి, ఏదుల ఆంజనేయులు, దేవనబోయిన కిష్టయ్య, కత్తుల నరసింహారెడ్డి, ముస్త్యాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- చైర్‌పర్సన్ రజిత వెంకటేష్
- నంబర్ వన్ హైస్కూల్‌లో విద్యార్థులకు షూస్ పంపిణీ
- ప్రభుత్వ విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి






**పరిగి, ఆగష్టు 13 (ప్రజాజ్యోతి) :** పరిగి పట్టణంలోని నంబర్ వన్ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం షూస్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొని సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు పాఠశాలల్లో అల్పాహారాన్ని కూడా అందిస్తోందని తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి ఆహ్లాదకర వాతావరణంలో బోధన జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆరిఫ్ పటేల్, ఎజాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ అయ్యూబ్, కో-ఆప్షన్ సభ్యులు అక్బర్ హుస్సేన్, ఆనంఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆమనగల్ 50 పడకల ఆసుపత్రిని పరిశీలించిన డీసీహెచ్ఎస్ అనురాగిణి రెడ్డి





**తలకొండపల్లి,ఆమనగల్ ఆగస్టు13 (ప్రజాజ్యోతి) :** రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు డా.దామోదర రాజనర్సింహా,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా డీసీహెచ్ఎస్ డా.అనురాగిణి రెడ్డి ఆమనగల్లులో నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు.డీఈ కోటేశ్వరావుతో కలిసి నిర్మాణ పనులు,మౌలిక వసతులను తనిఖీ చేశారు.ఆమనగల్ పట్టణ కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.17.50 కోట్లు కేటాయించిన సందర్భాన్ని గుర్తు చేశారు.ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కోసం మార్చురీ,కిచెన్ కమ్ డైట్ హాల్,లిఫ్ట్ వంటి అదనపు సదుపాయాల కోసం మరో రూ.3 కోట్ల రూపాయలు అవసరం ఉందని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని,నిర్మాణ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఆమనగల్లు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతుందన్నారు.ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు,ముఖ్యంగా పాము కాటు,కుక్క కాటు,కోతి కాటుకు సంబంధించిన మందులు,వ్యాక్సిన్ల స్టాక్ ను అడిగి తెలుసుకున్నారు.వర్షాకాల నేపథ్యంలో మలేరియా,టైఫాయిడ్,డెంగ్యూ వంటి విషజ్వరాలు,శ్వాసకోశ వ్యాధులు,సీజనల్ వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు.రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వైద్యులు,వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ విధుల పట్ల ఎలాంటి అలసత్వం వహించరాదని ఆదేశించారు.ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించేందుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డా.చంద్ర కృష్ణ,డా.అపర్ణ,డా.నాగరాజు,డా.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మినర్వా స్వీట్స్ 5వ బ్రాంచ్ ప్రారంభోత్సవం



**అబ్దుల్లాపూర్మెట్ ఆగస్టు 13 (ప్రజాజ్యోతి) :** మన్నత్ ప్లాజాలో మినర్వా స్వీట్స్ 5వ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వీట్స్, నమ్కీన్, చాట్, డ్రై ఫ్రూట్స్, జ్యూస్, గిఫ్టింగ్ తదితర ఉత్పత్తులను అందించే మినర్వా స్వీట్స్ నూతన శాఖను ప్రారంభించడంతో స్థానికంగా సందడి నెలకొంది.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన బ్రాంచ్ ద్వారా వినియోగదారులకు నాణ్యమైన స్వీట్స్, స్నాక్స్‌తో పాటు వివిధ రకాల ఆహార పదార్థాలు అందుబాటులోకి రానున్నాయి.మినర్వా స్వీట్స్ సంస్థ ఇప్పటికే పలు ప్రాంతాల్లో తమ సేవలను అందిస్తుండగా, ఐదో శాఖను సైదాబాద్‌లో ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అరిఫ్ హిరానీ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యత, రుచికి ప్రాధాన్యతనిస్తూ సేవలు అందిస్తామని తెలిపారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు,సిబ్బంది, స్థానికులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.

# పేదలపైనే పెను భారం!





- అల్లాపూర్‌లో పాక్షికంగా కూలిన రెండు ఇండ్లు
- మరమ్మతులు కూడా చేసుకోలేం
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికుల డిమాండ్

**తాండూరు ఆగష్టు 13 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం అల్లాపూర్ గ్రామంలో పేద కుటుంబాలపై పెను భారం మోపినట్లయింది. చిన్నపాటి ఇంటిలో నివాసముండే గోరెమియా, సాజిదా బేగం దంపతులిద్దరూ తలదాచుకునే ఇల్లు ప్రస్తుతం చిన్నపాటి వర్షానికి ఓవైపు ఇంటి గోడ కూలి పోయింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన గోరెమియా, సాజిదా బేగం దంపతులకు ఇద్దరు కొడులు, ఇద్దరు కోడళ్ళు వారి సంతానంతో ఏడు గురు వ్యక్తులు నివాసం ఉండే ఇల్లు ఓవైపు గోడ కూలిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుందామన్న ఆర్థిక స్తోమత బాగా లేకపోవడంతో ఉన్నదాంట్లోనే ఇమిడి పోదాం అనుకున్న ఆ కుటుంబానికి ఇలా భారంగా మారుతుందని అనుకోలేదని చెప్తున్నారు. అదేవిదంగా గ్రామానికి చెందిన వడ్డె భీమమ్మ భర్త రాములు కు చెందిన ఇల్లు చిన్నపాటి వర్షం కారణంగా వారం రోజుల క్రితం ఇంటికి ఓ వైపు గోడ కూలి పోయింది. దీంతో రెండు కుటుంబాల పరిస్థితి కూడ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు స్థానికులు చెప్తున్నారు. రెండు కుటుంబాలను ప్రభుత్వం ద్వారా ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు స్థానిక ప్రజలు. కూలిపోయిన ఆ ఇంటి గోడలను స్థానిక గ్రామస్తులు వడ్డె శ్రీనివాస్, రమేష్, మరి కొందరు కలిసి పరిశీలించారు.

## కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి







- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య పరీక్షలు
- ఆరోగ్యమే మహాభాగ్యం.. పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది విద్యార్థులకు డాక్టర్ శ్రావణ్ కుమార్ అవగాహన
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి విద్యార్థులకు వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచనలు
- విద్యార్థులకు వైద్య పరీక్షలు.. అవసరమైన వారికి మందుల పంపిణీ స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం
- ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో వైద్య బృందం పర్యటన
- పరిశుభ్రత, పోషకాహారం,వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం విద్యార్థులకు డాక్టర్ శ్రావణ్ కుమార్ దిశానిర్దేశం

**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) ఆగస్టు 13 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రం పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.పరీక్షల అనంతరం అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని,విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల,ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని,శుభ్రమైన నీటినే తాగాలని తెలిపారు.శారీరకంగా దృఢంగా ఉండేందుకు ప్రతిరోజూ చిన్నచిన్న వ్యాయామాలు చేయాలని సూచించారు.ప్రాంతీయంగా వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం అని,పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం,దోమల నివారణ చర్యలు చేపట్టడం,జ్వరం తదితర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థుల ద్వారా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి,పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణపై గ్రామ ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని పాఠశాల హెడ్మాస్టర్ బసవరాజుకు డాక్టర్ శ్రావణ్ కుమార్ సూచించారు.అనంతరం కొత్తపల్లి హెల్త్ వెల్నెస్ సెంటర్ భవన నిర్మాణ పనులను మెడికల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్ పరిశీలించి, పనుల పురోగతిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విజయమ్మ, శరభలింగం, శ్రీనివాసులు, శారద, ఏఎన్ఎం పుష్ప, పాఠశాల ప్రధానో ఉపాధ్యాయులు బసప్ప మరియు ఉపాధ్యాయుల బృందం, ఆశా కార్యకర్తలు నరసింగమ్మ, కమలమ్మ, నూర్జహా, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై సభలో గళమెత్తిన సర్పంచ్





- సంగెం కలాన్‌లో ఇళ్ల మధ్యనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- ప్రమాదకరంగా మారినా పట్టించుకోరా అంటూ అధికారులను ప్రశ్నించిన సర్పంచ్ మీనాక్షి
- పాఠశాలకు అవసమైన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్
- స్పందించిన ఎమ్మెల్యే విద్య, విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు

**తాండూరు, ఆగస్టు 13, ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంగెం కలాన్ గ్రామంలో ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ సర్పంచ్ మీనాక్షి శ్రీనివాస్ తాండూరు మండల సర్వసభ్య సమావే శంలో గళమెత్తారు. గ్రామంలోని ఇళ్ల మధ్యనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో అటు గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులు భయాందో ళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫా ర్మర్‌ను వెంటనే ఇక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆమె సభ దృష్టికి తీసుకువచ్చా రు.ఇళ్ల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫా ర్మర్ ఉండటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతు న్నారని సర్పంచ్ తెలిపారు. పలుమార్లు సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువచ్చినా సరైన చర్యలు తీసుకోలేదని ఆమె సభలో ప్రశ్నించారు. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.



విద్యార్థుల తరగతులకు తగిన ఉపాధ్యాయులు లేక విద్యా వ్యవస్థ సక్రమంగా సాగడం లేదని దీంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ ఎమ్మెల్యే ను కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని కోరారు.స్పం దించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గ్రామ సర్పంచ్ మీనాక్షి శ్రీనివాస్ సభలో ప్రస్తావించిన అన్ని సమస్యలపై ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్పందించారు. సంగెం కలాన్ గ్రామంలోని ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను పరిష్కరించడంతో పాటు పాఠశా లలో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత విద్యుత్, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించా లని సూచించారు. ఈ కార్యక్రమం లో పలువురు సర్పంచులు, అధికారులు ఉన్నారు.

## మునగనూరులో ఘనంగా చిత్రలేఖ స్టూడియోస్ ప్రారంభోత్సవం



**అబ్దుల్లాపూర్‌మెట్టు, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి) :** అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం మునగనూరు గ్రామంలో అపోలో ఫార్మసీ సమీపంలో చిత్రలేఖ స్టూడియోస్ను గురువారం ఘనంగా ప్రారంభించారు. స్టూడియో నిర్వాహకులు ముస్కూర్ అక్షిత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, స్థానికులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముస్కూర్ అక్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. వివాహాలు, శుభకార్యాలు, ప్రత్యేక కార్యక్రమాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన ఫోటోగ్రఫీ, వీడియో సేవలను అందించడమే తమ లక్ష్యమన్నారు. లగ్జరీ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ, ప్రీమియం ఆల్బమ్స్, వెడ్డింగ్ ఫిలిమ్స్, స్టోరీ టెల్లింగ్, ఫోటోగ్రఫీ, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ స్టూడియో వంటి విభిన్న సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.వివాహ వేడుకల్లోని ప్రతి ముఖ్యమైన క్షణాన్ని సహజత్వం కోల్పోకుండా అందంగా చిత్రీకరించడమే లగ్జరీ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ ప్రత్యేకత. వధూవరుల ప్రత్యేక ఫోటోషూట్లు, కాండిడ్ ఫోటోగ్రఫీ, కుటుంబ సభ్యులు--బంధుమిత్రుల జ్ఞాపకాలను సృజనాత్మకంగా చిత్రీకరించడం ద్వారా వివాహ వేడుకను జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకంగా మలుస్తారు.నాణ్యమైన ఆల్బమ్స్, వెడ్డింగ్ ఫిలిమ్స్

అత్యాధునిక డిజైన్‌తో ప్రీమియం క్వాలిటీ ఆల్బమ్స్‌ను రూపొందించడంతో పాటు, వివాహ వేడుకలోని ముఖ్య ఘట్టాలను కథనం తరహాలో అందంగా రూపొందించే వెడ్డింగ్ ఫిలిమ్స్ కూడా అందిస్తారు. వధూవరుల పరిచయం నుంచి వివాహ వేడుక వరకు ముఖ్యమైన క్షణాలను ఒక అందమైన కథలా మలచడమే స్టోరీ టెల్లింగ్ ప్రత్యేకత: సినిమాటోగ్రఫీ ద్వారా వివాహ వేడుకలకు సినిమాటిక్ లుక్‌ను అందిస్తూ, డ్రోన్ షాట్స్, క్రియేటివ్ యాంగిల్స్, స్లో మోషన్ తదితర సాంకేతిక విధానాలతో వీడియోలను రూపొందిస్తారు. అనంతరం నిపుణులైన ఎడిటింగ్ ద్వారా ఫోటోలు, వీడియోలకు మరింత ఆకర్షణీయమైన రూపాన్ని అందిస్తారు.మునగనూరు గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా తమ స్టూడియోను సందర్శించి అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించి, తమను ప్రోత్సహించాలని అక్షిత్ రెడ్డి కోరారు. తమను సంప్రదించే ప్రతి కస్టమర్‌కు నాణ్యమైన సేవలు అందించి పూర్తి సంతృప్తి కలిగించడమే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండలం యువ నాయకులు కిషోర్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఫిర్యాదులు అందిన వెంటనే కొత్త డిటిఆర్‌లు ఏర్పాటు చేస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్



**పరిగి, ఆగష్టు 13 (ప్రజాజ్యోతి):** పరిగి మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్నలో వోల్టేజ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చోట్ల కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డిటిఆర్ లు) ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో విద్యుత్ సంబంధిత సమస్యలను వెంటనే మున్సిపల్ కార్యాలయం దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి సహకారంతో పట్టణంలో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా సంకోచించకుండా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం

శుభాకాంక్షలు తెలిపిన అంతారం గ్రామ ప్రజలు



**తాండూరు ఆగష్టు 13 ప్రజాజ్యోతి :** తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ వడ్డె శ్రీనివాస్ కు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమక్షంలో ఘన సన్మానం కల్పించింది. గురువారం రోజు జరిగిన తాండూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జంగని మొగులయ్య, బుడిగ జంగం బద్రు, శాలువా, పూల మాలతో సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు వురు డైరెక్టర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

## అమర జవాన్ నీరటి చంద్రశేఖర్‌కు ఘన నివాళి



**షాద్ నగర్, ఆగష్టు 13(ప్రజాజ్యోతి):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కొందుర్గు మండల బీజేపీ ఆధ్వర్యంలో అమర జవాన్ నీరటి చంద్రశేఖర్‌కు ఘన నివాళులు అర్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు తంగేళ్లపల్లి, తిరుమనీ దేవునిపల్లి గ్రామాల్లోని చంద్రశేఖర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నీరటి చంద్రశేఖర్ చేసిన త్యాగం చిరస్మరణీయమని అన్నారు. అమర జవాన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అమర జవాన్ కుటుంబానికి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా, ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చంద్రశేఖర్ సేవలు, త్యాగం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కక్కునూరు వెంకటేష్ గుప్తా, మాజీ మండల అధ్యక్షుడు బలవంత్ రెడ్డి, కొమరబండ శ్రీశైలం, పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

రూ.80 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం



**షాద్‌నగర్, ఆగష్టు 13(ప్రజాజ్యోతి):** పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మున్సిపల్ పాలకవర్గం ముందుకు సాగుతోందని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ 18వ వార్డులో రూ.80 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కీర్తి అపార్ట్‌మెంట్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, స్థానిక ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. 18వ వార్డులో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మెన్ అందేమోహన్ ముదిరాజ్,మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, కౌన్సిలర్లు సంతోషిబాయి చందూలాల్, బచ్చలి నరేష్, మురళీమోహన్ (అప్పి), మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్ సుజీవన్, ముబారక్ అలీ ఖాన్, తంగడపల్లి శంకర్, కత్తి చంద్రశేఖర అప్ప, భూషన్, మేకల వెంకటేష్, విష్ణువర్ధన్ రెడ్డి, మురళి, మహబూబ్, రోమియో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

## ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి ) ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు భవనం శిథిలావస్థకు చేరినందున.. మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లోకి ఈ స్కూల్ ను తరలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి





కేంద్రంలోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు కలియ తిరుగుతూ రిజిస్టర్ పరిశీలించారు. పిల్లలు, సిబ్బంది వివరాలు, చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జిల్లాలోని 16 భవిత కేంద్రాల్లో తాగునీరు(వాటర్ డిస్పెన్సరీలు ) ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు. ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది(సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులు పరిశీలించారు.. అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు. పాఠశాలలో వృథాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటంపై అసహన వ్యక్తం చేశారు. ఏర్పాట్లు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్ ను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృథాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన నగరంలోని డాక్టర్ స్ట్రీట్ లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి.. పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

# మెడికవర్‌లో ఉచిత క్యాన్సర్ శిబిరం...

కరీంనగర్ టౌన్, ఆగస్టు 13( ప్రజాజ్యోతి ) క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో వ్యాధి నుంచి త్వరగా బయటపడే అవకాశం ఉంటుందని హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ అంకాలజిస్టులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ నీలేష్, డాక్టర్ స్నేహ సూచించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి మొత్తం 186 మంది హాజరై క్యాన్సర్ సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోగా, 26 మందికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. క్యాన్సర్ కేసుల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఇకపై ప్రతి నెల రెండో గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వైద్యులు మాట్లాడుతూ... కరీంనగర్‌లో ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. మహిళల్లో ప్రతి ఎనిమిది మందిలో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ రావడం వ్యాధి తీవ్రతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. అయితే క్యాన్సర్ లక్షణాలు స్పష్టంగా బయటపడక ముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో ముందుగానే గుర్తించవచ్చన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా కొంతమందినైనా కాపాడాలనే ఉద్దేశంతో మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను




గుర్తించి తగిన చికిత్స అందించవచ్చన్నారు. క్యాన్సర్‌ను నిర్లక్ష్యం చేస్తే వ్యాధి దశ పెరిగే కొద్దీ తీవ్రత కూడా పెరుగుతుందని, తద్వారా చికిత్స మరింత క్లిష్టతరంగా మారే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరించారు. ఊబకాయం బారిన పడకుండా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నిర్వహిస్తోందని వైద్యులు తెలిపారు. ముందస్తు గుర్తింపు, సరైన సమయంలో చికిత్స, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్‌హెడ్ సంపత్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, పీఆర్ అబ్దుల్‌వకీల్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా సి పి ఐ పాదయాత్ర

ఇల్లంతకుంట ఆగస్టు 13(ప్రజా జ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు బ్రిడ్జి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మంద అనిల్ కుమార్, సావనపెల్లి మల్లేశం ఆధ్వర్యంలో గురువారం రోజు ప్రజా చైతన్య ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ హాజరైనారు ఈ సందర్భంగా మంద సుదర్శన్ మాట్లాడుతూ ఆగస్టు 6 నుండి 14 వరకు దేశవ్యాప్త రాజకీయ ప్రచారం పాదయాత్రలకు సిపిఐ పిలుపునిచ్చిందనీ ఈ పాదయాత్రలు 2026 సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరగబోయే "బద్లావ్ జరూరీ హై" ( మార్పు అత్యవసరం) ర్యాలీలతో ముగుస్తాయని



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగు ఈ పాదయాత్రలను సెప్టెంబర్ 1న మార్పు కోసం చలో ఢిల్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ పిలుపులో భాగంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలనీ. సార్వత్రిక విద్య, ఆరోగ్యం అందుబాటులోకి తేవాలనీ. అలాగే పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధత కల్పించాలనీ. ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలి. మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలన్నారు. బ్యాలెట్ పేపరు పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనీ అలాగే దళిత ఆదివాసీలపై దాడులను నిలిపివేయాలి. మహిళలకు రక్షణ కల్పించి. నేడు భారతదేశంలో ఒక కీలకమైన మలుపులో నిలిచి ఉంది నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ దశబ్దం క్రమంగా ఆందోళన నిరషా మరియు పెరుగుతున్న కష్టాలకు దారితీసింది ఎన్నికల సందర్భంగా బిజెపి అభివృద్ధి ఉపాధి సంక్షేమం సుపరిపాలన మరియు మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసింది కానీ దానికి బదులుగా దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం భరించలేనీ ద్రవ్యోల్బణం ధరల పరుగుదల విస్తరిస్తున్న అసమానతలు బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోతున్న ప్రజాస్వామ్యం మరియు ప్రభుత్వం సామాజిక లను ఉద్రిక్తలను ఏరుకుంటుంది అయినాప్పటికీ మోదీ ప్రభుత్వం నుండి ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలని కోరినప్పుడల్లా ఈ చర్చను ఇతర అంశాల వైపునకు మళ్లిస్తున్నారు సామాన్య ప్రజలకు అన్యాయం చేస్తున్నారు మత విద్వేషాలతో యువతను ప్రజలను పక్కదారి పట్టిస్తూ కాలం గడుపుతున్న పరిస్థితి ఉందన్నారు. మొన్నటికి మొన్న నీటి పరీక్ష పేపర్ లింకుతో దేశమంతటా విద్యార్థులు ఆందోళనలతో జంతర్ మంతర్ వద్ద విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని అలుపెరుగని పోరాటాలు చేస్తున్న విద్యార్థులపై దాడులు నాటి చార్జీలతో భయభ్రాంతులకు గురిచేసిన మూడు ప్రభుత్వానికి భవిష్యత్తులో తగిన గుణపాఠం ఈ దేశ ప్రజలు మహిళలు యువత విద్యార్థులు బుద్ధి చెప్తారని తెలియజేశారు. అలాగే భారత రాజ్యాంగాన్ని మార్చడం కొరకు మోడీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు భూంపెల్లి భూమిరెడ్డి, కాదురు మొండయ్య, పెండెల అధిత్య, గుంటి బక్కయ్య, గుంటి తిరుపతి, రాజయ్య, దొమ్మరి కనకయ్య, కోల వెంకటయ్య, గొట్లముక్కుల రాజయ్య, చిగుర్ల అనీల్, తోట్ల రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జంతర్, మంతర్,లోజర్నలిస్టుల ధర్నాకు కేంద్రంస్పందన టీ.డబ్ల్యూ.జే.ఎఫ్,వినతిపై చ ర్యలు ప్రారంభం

వేములవాడ,ఆగస్టు,13:ప్రజా జ్యోతి. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ.డబ్ల్యూ. జే.ఎఫ్) ఆధ్వర్యంలో జూలై 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ లో నిర్వహించిన జర్నలిస్టుల ధర్నా పై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా అనం తరం కేంద్ర



ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రం పై చర్యలు ప్రారంభమయ్యాయి. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, చట్టపర మైన రక్షణ తదితర అంశాలపై టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన మంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించింది. ఈ వినతి పత్రంలో అక్రెడేటెడ్ జర్నలిస్టులకు 50 శాతం రైల్వే ఛార్జీ రాయితీ, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ పునరుద్ధర ణ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యకు చట్టపరమైన పరిష్కారం, స్వతంత్ర నేషనల్ మీడియా కమిషన్ ఏర్పా టు, వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించడం/సవరణలు చేయడం, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం, ప్రింట్,ఎలక్ట్రానిక్,డిజిటల్ మీడియా ఉద్యోగులకు రక్షణ, కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు, జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం తదితర డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసు కెళ్లారు. ఈ వినతిపై పి.ఎం.ఓ.పి.జి /D/2026/0139147 నంబరుతో జూలై 28న ఫిర్యాదు నమోదు కాగా, సం బంధిత అంశాన్ని పరిశీలించేందుకు మీడియా యూనిట్ సెల్–Iకి బదిలీ చేసినట్లు రిజిస్ట్రేషన్ వివరాల్లో నమోదైంది. మరో కీలక పరిణామంగా, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి 2026 ఆగస్టు 8న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కార్యదర్శికి అధికారిక లేఖ జారీ అయింది. టీడబ్ల్యూజేఎఫ్ తరఫున సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సమర్పించిన ఫిర్యాదు ను ప్రస్తావిస్తూ, జర్నలిస్టుల సంక్షేమం, సేవా పరిస్థితులు, చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత, కార్మికహక్కులకు సంబంధించిన అంశాలపై తగిన చర్యలు తీసుకుని, ఫి ర్యాదును వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కేంద్ర మంత్రిత్వ శాఖ కోరింది. తమ విజ్ఞప్తి మేరకు రైల్వే రాయితీ విషయం పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా స్పందించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం జర్న లిస్టుల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని మామిడి సోమయ్య కోరారు.

# వేములవాడ అర్బన్, మండలంలో ఘనంగా తిరంగా యాత్ర

వేములవాడ,ఆగస్టు,13:ప్రజాజ్యోతి. వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ కార్యాలయం నుంచి జాతీయ జెండాలతో ప్రారంభమైన బైక్ ర్యాలీ కొడిముంజ, శభాష్‌పల్లి, చింతలఠాణ గ్రామాల మీదుగా నంది కమాన్ చౌరస్తా వరకు సాగింది. ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు జాతీయ ఐక్యతను చాటే విధంగా ఈ



తిరంగా యాత్రను నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. జాతీయ జెండాలతో బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వర రావు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల రాజవ్వ, మండల ఉపాధ్యక్షులు ఎరుగొక్కుల రమేష్, తిప్పరవేణి రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గోనె భాస్కర్, ఆరేపల్లి ఉపసర్పంచ్ సిల్వేని ప్రశాంత్, మండల కార్యదర్శులు సంజీవ్ రెడ్డి, బూర శేఖర్, సీనియర్ నాయకులు సురువు వెంకట్, కొమిరె అంజన్న, చల్ల నర్సయ్య, పోచంపల్లి భాను, నర్సింగోజు శంకర్, పెరంగని మల్లేశం, గుగ్గిళ్ల చంద్రశేఖర్, బూత్ అధ్యక్షులు చింతకుంట నర్సయ్య, కంసాని రాము, తుమ్మల సాయిర్నాథ్, గాండ్ల తిరుపతి, ఎడ్ల హరీష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

కొడిమ్యాల,ఆగస్ట్ 13,(ప్రజాజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని పీఆర్‌టీయూ–టీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోయినిపెల్లి ఆనంద్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ.. మూడేళ్లుగా పీఆర్‌సీ లేక ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అంజయ్య, రాజమల్లయ్య, సదయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలలో సందడిగా నమూనా ఎన్నికలు,

## ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన

ఎండపల్లి, ఆగస్ట్ 13, ప్రజా జ్యోతి ఎండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నమూనా ఎన్నికలు (మాక్ ఎలక్షన్స్) నిర్వహించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.సాధారణ ఎన్నికల తరహాలో అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు చేపట్టారు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల ప్రక్రియను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఓటు హక్కును స్వేచ్ఛగా, బాధ్యతగా వినియోగించుకోవాలని ప్రలోభాలకు గురికాకుండా అభ్యర్థుల గురించి తెలుసుకుని ఓటు వేయాలని





అవగాహన కల్పిస్తూ, ప్రతి ఓటుకు ఉన్న విలువను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు డి. రవీందర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్యంపై అవగాహన అవసరమన్నారు.బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో నమూనా ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా దేశభక్తి నినాదాలతో హోరెత్తిన శంకరపట్నం,

శంకరపట్నం,ఆగస్టు13( ప్రజా జ్యోతి) కరీంనగర్ జిల్లాశంకరపట్నం మండలంలో స్ఫూర్తికి చిహ్నమైన మువ్వన్నెల పండుగ ను శంకరపట్నం లో అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగు అనిల్ ఆధ్వర్యంలో తాడికల్ గ్రామం నుండి కేశవపట్నం బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు త్రివర్ణ పతాకాన్ని ఉత్సవంగా సాగిన ఈ ర్యాలీలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారూ అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు చేతిలో జాతీయ జెండాలు పట్టుకుని భారత్ మాతా కీ జై వందేమాతరం జై హింద్ నినాదాలతో గ్రామ ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న బీజేపీ మండల



అధ్యక్షుడు ఏనుగు అనిల్ మాట్లాడుతూ మువ్వన్నెల జెండా మన ఆత్మగౌరవానికి చిహ్నం. ప్రతి ఇంటా తిరంగా ఎగరాలి. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుని యువత దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగు అనిల్ బిజెపి నాయకులు యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటింటా జాతీయ జెండాల పంపిణీ

గంభీరావుపేట ఆగస్టు 13 (ప్రజా జ్యోతి); గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం బిజెపి సీనియర్ నాయకులు సర్వోత్తమ్ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఇంటింటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ నాయకులు జాతీయ జెండాలను



ఇంటింటికి పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు ఇంటిపై జెండా ఎగురవేయాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని, ప్రజలను కోరారు.

## మోర పద్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి



**నేలకొండపల్లి, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన మోర పద్మ కుటుంబాన్ని గురువారం రాష్ట్ర మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పరామర్శించారు. మండల కేంద్రంకు చెందిన మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోర మల్లయ్య సతీమణి పద్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకుని ఆమె నివాసం కు వెళ్లి చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, నల్లాని మల్లికార్జునరావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో పార్థు మృతికి మట్టా నివాళి



**సత్తుపల్లి ఆగస్టు13(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని కిష్టారం గ్రామానికి చెందిన ముటకలపాటి రవీంద్రబాబు వారి కుమారుడు పార్థసారథి అమెరికాలో హార్ట్ స్ట్రోక్ తో మృతి చెందినారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ గురువారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చినారు. చిన్న వయసులో గుండె దెబ్బతో చేతికి వచ్చిన కొడుకు దూరం కావటం బాధాకరమని, కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు.ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సర్పంచ్ నరుకుల్ల రాజేశ్వరి,అప్పారావు, రవి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మలిరెడ్డి మురళి రెడ్డి,కమల్ పాషా, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేసిన డాక్టర్ మట్టా



**సత్తుపల్లి ఆగస్టు13(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పుట్టినరోజు సందర్భంగా, పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో, ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు,నోట్ బుక్స్, ప్యాడ్స్, గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు అండగా ఆషా స్వచ్ఛంద సంస్థ ఉందని, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అన్ని విధాల విద్యార్థులకు అండగా ఉన్నదని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,ఒక మంచి గోల్ పెట్టుకొని డాక్టర్ లు గా, ఇంజనీర్లుగా, లెక్చరర్లు, ప్రభుత్వ ఉద్యోగిగా లక్ష్యంతో చదివి, ఉజ్వల భవిష్యత్తుకు దారి తీసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధికి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నారని, వారి సేవలు ఎంతగానో ఉపయోగించుకున్నామని ,పేద విద్యార్థులు సహాయం చేయడంలోనూ,ఏమి కావాలన్నా ముందుకు వచ్చి నేనున్నాను అనే ధైర్యాన్ని అందించారని,ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది లలితమ్మ, ప్రమీల, వనజా రాణి, కల్పన, సత్యనారాయణ, కృష్ణవేణి, రామారావు, శ్వేత, సమ్మక్క, శిరోమణి, వెంకటేశ్వర రావు, సౌజన్య,సీతలతోపాటు మున్సిపల్ చైర్పర్సన్ రెహనా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, గాదె చెన్నారావు, విద్యార్థులు ఉన్నారు.

## ఘనంగా రేణుక చౌదరి జన్మదిన వేడుకలు



**సత్తుపల్లి ఆగస్టు13(ప్రజా జ్యోతి)** రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి జన్మదిన వేడుకలను, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో,స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఘనంగా ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా భారీ కేకు కట్ చేసి,అందరికీ మిఠాయిలు పంపిణీ చేసి, ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు అన్న తెలియజేసినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని కృషి చేసిన మహిళగా రేణుకా చౌదరి అని, ఎన్నో పదవులు చేపట్టి,ఉన్నత స్థితిలో ఉన్నారని, ఇంకా మంచి పదవులు పొందాలని, భవిష్యత్తులో ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు,గాదె చెన్నారావు,మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు మల్లిరెడ్డి మురళి రెడ్డి, కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి

- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ
- 3నుంచి నాలుగో పంప్ హౌస్ మధ్యలో 532 ఎకరాల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి
- జూలూరుపాడు టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- సాగర్ ఆయకట్టు పంటలకు మరోసారి నీటిని విడుదల చేయాలి



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 13,(ప్రజాజ్యోతి)** సీతారామ ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలు, ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు గురువారం సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల కోరారురూ. 45 కోట్లతో 532 ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని, మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ వరకు నీటిని తరలించేందుకు అవసరమైన 532 ఎకరాల భూసేకరణ ప్రక్రియను రూ. 45 కోట్లతో చేపట్టినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల పరిధిలో ఈ భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతుల భూములన్ని సస్యశ్యామలం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టు రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ సేకరణ, పైప్ లైన్ నిర్మాణం పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.ములకలపల్లి మండలం కమలాపురంలోని మూడో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట మండలం లోని నాలుగో పంప్‌హౌస్ వరకు కాలువ ద్వారా నీటిని తరలించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అయితే నాలుగో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని చెరువులకు గోదావరి జలాలను కాలువల ద్వారా అందించే ప్రతిపాదనలకు బదులుగా పైప్‌లైన్ ద్వారా నీటిని అందించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పైప్‌లైన్ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి, నిధులు విడుదల చేసి పనులను చేపడితే భూసేకరణ వ్యయం తగ్గడంతో పాటు రైతులు తమ భూములను కోల్పోవాల్సిన అవసరం ఉండదని మంత్రి తుమ్మల వివరించారు.

**జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం చేయండి.**

జూలూరుపాడు టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు జలాశయానికి నీటిని అందించాలని మంత్రి తుమ్మల కోరారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కొనసాగితే ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతుల పంటలను రక్షించేందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా మరోసారి సాగునీటిని విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయకట్టు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, టన్నెల్ తదితర పనులను వేగవంతం చేసి, రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు.

# ఎర్ర జెండా కోసం పోరాడిన వ్యక్తి "సత్యానందం"

- దేశంలో ఏ పోరాటం జరిగిన వెనుక ఎర్ర జెండా ఉంటుంది
- టర్కీ దేశం వెళ్లి అర్ధాంతరంగా పారిపోయిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్
- మధిర పరువును తీస్తున్న డిప్యూటీ సీఎం సతీమణి "నందిని"
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు
- గోవిందపురం ఎల్ గ్రామంలో "సత్యానందం"సంస్మరణ సభలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు



**బోనకల్, ఆగస్ట్ 13 (ప్రజా జ్యోతి):** మంద సత్యానందం తన జీవితాంతం ఎర్రజెండా అభివృద్ధి కోసం, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశాడని పోతినేని సుదర్శన్ రావు కొనియాడారు. దేశంలో ఎర్ర జెండా ఎక్కడ ఉంది అని అంటారు కానీ మరలా వాళ్లే దేశంలో ఏ పోరాటం జరిగిన దాని వెనక ఎర్రజెండా ఉందని వాళ్లే అంటున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. మండల పరిధిలోనే గోవిందాపురం ఎల్ గ్రామంలో సిపిఎం నాయకుడు మంద సత్యానందం (విజన్ ఆంధ్ర విలేఖరి) సంస్మరణ సభ కోట కాటయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. తొలుత మంద సత్యానందం చిత్రపటానికి పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్ ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు మండల కార్యదర్శి కిలారు సురేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాదరావు, దొండపాటి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమస్మరణ సభలో పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. సత్యానందం అతి తక్కువ వయసులోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం చాలా బాధాకరం అన్నారు. కుటుంబం కోసం కాకుండా పార్టీ, ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి సత్యానందం అన్నారు. జర్నలిజంలో ధైర్యంగా తన వృత్తిని కొనసాగించిన వ్యక్తి సత్యానందం అన్నారు. గోవిందాపురం ఎల్ గ్రామంలో తనపై శత్రువుల దాడులు ఎన్ని జరిగినా అధైర్య పడకుండా ధైర్యంగా శత్రువు దాడులను ఎదుర్కొంటూ పార్టీలో పని చేసిన ధైర్యవంతుడు సత్యానందం అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్టీపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని, దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టర్కీ పర్యటనకు వెళ్లి ఏదో మెసేజ్ రాగానే భయపడి అక్కడ నుంచి పారిపోయి అమెరికా వెళ్ళిపోయాడని తెలిపారు. అమెరికా వెళ్లిన తర్వాత కొంతమంది జర్నలిస్టులు అర్ధాంతరంగా ఎందుకు పర్యటన ముగించుకొని వచ్చారని ప్రశ్నిస్తే అందులో చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం పాత్ర ఉండి ఉండవచ్చునని అన్నారని తెలిపారు. కమ్యూనిస్టులు అంటే డోనాల్డ్ ట్రంప్ కి అంత భయం అంటూ ఎద్దేవా చేశారు. అది ఎర్ర జెండా పవర్ అంటూ పోతినేని అన్నారు. యువతరం పోరాటాలలోకి ముందుకు రావాలన్నారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీలో బిజెపి ప్రభుత్వం విద్యార్థుల పోరాటానికి దిగి వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 22 మంది విద్యార్థుల ప్రణాలను బలి కొన్నదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మధిర నియోజకవర్గానికి ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నాయని, కానీ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పరువు తీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ మహిళ రిటైర్డ్ ఉద్యోగిని ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కోసం వెళ్తే 10 శాతం కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేసిందని ఆమె బహిరంగంగా ప్రకటించిన అన్నారు. డిప్యూటీ సీఎం పరిపాలనలో అవినీతి విలయతాండవం చేస్తుందని అందులో ఆయన సతీమణి కమిషన్ల పేరుతో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు కి పాల్పడుతుందని విమర్శించారు.

**సమస్యలను వెలిగితీయటంలో సత్యానందం కృషి అభినందనీయం: సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**

సమస్యలను వెలుకి తీయటంలో సత్యానందం ఎంతో కృషి చేశారని, ప్రధానంగా సోషల్ మీడియాలో నిత్యం చురుకుగా ఉండేవాడని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. విలేఖరిగా ఇటీవల అతనిపై దాడులు కూడా జరిగాయి అన్నారు. ముదిగొండలో ఏడుగురి ప్రాణాలతోటే నేడు పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు వస్తున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ నాయకుల సొత్తు కాదని అది ప్రజా సొమ్ము అన్నారు. అడుక్కునే సమాజం ఉండకూడదనిదే కమ్యూనిస్టు సిద్ధాంతమన్నారు. ప్రతి వ్యక్తి గౌరవంగా బతికే సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేస్తుందన్నారు. అరాచక వాదులకు వ్యతిరేకంగా సత్యానందం తన పోరాటం కొనసాగించాడని అభినందించారు. సత్యానందం సంస్మరణ సభలో బండి రమేష్, బండి పద్మ, కళ్యాణం వెంకటేశ్వరరావు, మడిపల్లి గోపాలరావు, కిలారు సురేష్, సిపిఎం డివిజన్ నాయకులు శీలం నరసింహారావు, పడకంటి మురళి, మద్దాల ప్రభాకర్, మాజీ జెడ్పిటిసి బానోతు కొండ, సిపిఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ముత్తారపు గిరి, సిపిఎం సీనియర్ నాయకులు మాదినేని నారాయణ, మాదినేని వీరభద్రరావు, ఏడునూతల లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, గ్రామ సర్పంచ్ మంద కరుణ, తమ్మారపు లక్ష్మణరావు, నవతెలంగాణ జిల్లా ఇన్చార్జి ఇరుగు వెంకటేశ్వర్లు, పాతర్లపాడు సిపిఎం సీనియర్ నాయకులు కొండ్రు జానకిరామయ్య, ఓబినబోయిన అచ్చయ్య, వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున సిపిఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# "సత్యానందం" కుటుంబానికి భారీగా ఆర్థిక చేయూత

- కీలక పాత్ర నిర్వహించిన టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లకొండ రాంబాబు
- బోనకల్, మధిర, చింతకాని జర్నలిస్టులు చేయూత - గోవిందాపురం గ్రామస్తులు, మిత్రులు, వివిధ పార్టీల నాయకులు విరాళాలు



**బోనకల్, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన "విజన్ ఆంధ్ర" విలేఖరి సిపిఎం సభ్యుడు మందా సత్యానందం ఈనెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సత్యానందం కుటుంబం అత్యంత నిరుపేద కుటుంబం కావడంతోపాటు ముగ్గురు ఎనిమిది సంవత్సరాల లోపు వయసు కలిగిన చిన్నారులే కావటం విశేషం. సత్యానందం అంతిమయాత్ర రోజు ముగ్గురు పిల్లలను చూసిన ప్రతి ఒక్కరూ కన్నీరు పర్వతం అయ్యారు. దీంతో గోవిందాపూర్ ఎల్ గ్రామానికి చెందిన టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లం కొండ రాంబాబు, సిఐటియు మాజీ నాయకుడు వల్లం కొండ సురేష్, బోనకల్ మాజీ ఎంపీపీ కొమ్ము శ్రీనివాస్ రావు, బోనకల్, మధిర, చింతకాని మండలాల జర్నలిస్టులు తీవ్రంగా స్పందించారు. "సత్యానందం కుటుంబానికి చేయూత" అనే గ్రూపును కేవలం రెండు రోజుల క్రితం వల్లం కొండ రాంబాబు ఏర్పాటు చేశాడు. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే గోవిందాపురం ఎల్ గ్రామ ప్రజలతోపాటు వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులు స్పందించారు. ఎవరికి తోచిన విధంగా వారు ఆర్థిక సహకారం అందజేశారు. వల్లంకొండ రాంబాబు కృషితో సుమారు రూ. 3.40 లక్షలు దాతల నుంచి ఆర్థిక సహకారం అందించారు. బోనకల్ జర్నలిస్టు మిత్రుల నుంచి సుమారు రూ. 80 వేల వరకు వచ్చాయి. అదేవిధంగా మధిర చింతకాని మండలాల నుంచి కూడా జర్నలిస్టు మిత్రులు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు కూడా ఆర్థిక సహకారం అందజేశారు. ఈ విధంగా దాతల నుంచి సుమారు రూ. 4 లక్షల వరకు ఆర్థిక సహకారం అందింది. ప్రముఖ ఐలు రాష్ట్ర నాయకులు ఏదునూతల శ్రీనివాసరావు కుటుంబం రూ. 30 వేల రూపాయలను అందజేశారు. దాతల నుంచి వచ్చిన నగదు మొత్తాన్ని ఫిక్స్ డిపాజిట్ చేసి సత్యానందం కుటుంబానికి అందజేయనున్నారు. విరాళాల ద్వారా వచ్చిన నగదు మొత్తాన్ని సత్యానందం సతీమణి సుమంత్ కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, బండి పద్మ, కళ్యాణ వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్ రావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, వల్లంకొండ రాంబాబు అందజేశారు. ఆర్థిక సహకారం అందించిన ప్రతి ఒక్కరికి సత్యానందం కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

# మోడికి ట్రంప్ ఫోబియా

- కమ్యూనిస్టులతో మార్పు తథ్యం
- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు
- తప్పు చేయకపోతే జంకు ఎందుకు
- సిపిఐ నేత కూనంనేని




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సువిశాల భారతదేశానికి ప్రధాని అయిన నరేంద్రమోడి పిరికివాడిగా మారిపోయాడని, ఆయనకు ట్రంప్ ఫోబియా పట్టుకుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. 145 కోట్ల జనాభా గలిగిన దేశానికి ప్రధానిగా ఉన్న అల్పసంఖ్యాకులైన సంపన్నులు కార్పోరేట్ల కోసం మాత్రమే పనిచేస్తున్నారన్నారు. సిపిఐ జన చైతన్య యాత్రల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం నగరంలో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రల అనంతరం ఖమ్మం జడ్పీ సెంటర్ నుంచి పాత బస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది పార్టీ కార్యకర్తలు, కళాకారుల ప్రదర్శనతో వైరా రోడ్ అరుణావర్ణం పులుముకుంది. భక్తరామదాసు కళాక్షేత్రంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు కమ్యూనిస్టు పోరాట ఫలితంగా వచ్చాయని,ఇప్పుడు దేశంలో మార్పు సైతం,కమ్యూనిస్టుల ద్వారానే సాధ్యమవుతుందని ఇది తథ్యమని అన్నారు. ఎన్నికలు ఆర్థిక వ్యవహారంతో ముడిపడి కోట్లు ఖర్చు చేస్తున్నవారు మాత్రమే విజయం సాధిస్తున్న ఈ రోజుల్లో కమ్యూనిస్టులు సీట్లు గెలవలేకపోవచ్చు కాని, గెలుపు ఓటములను, శాసించే శక్తి కమ్యూనిస్టులకు ఉందని సాంబశివరావు తెలిపారు. మోడి, అమిత్ షాలు తప్పు చేశామన్న భావనతో ఉన్నారని, అందుకే పార్లమెంట్ వచ్చేందుకు జంకుతున్నారన్నారు. మోడికి తిరోగమనం ప్రారంభమైందని,సబ్బండ వర్గాలు మోడి పాలనను వ్యతిరేకిస్తున్నాయన్నారు. ధర్మేంద్రప్రధానే రాజీనామాతో మోడి అహంకారం దిగిపోయిందని, యువత ముఖ్యంగా జెనీ ఉద్యమం దేశవ్యాపితమైందని, బిజెపి అధికారం కోల్పోటమే ఇక మిగిలిందని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టులు ప్రపంచ వ్యాపితంగా పురోగమిస్తున్నారని, అందుకే అక్కడ ట్రంప్, ఇక్కడ మోడి బయటపడుతున్నారన్నారు. దేశాన్ని దోచుకుంటూ సంపదను,కార్పోరేట్లకు కట్టబెడుతున్న బిజెపి సర్కార్,ఇప్పుడు అయోధ్య రాముని సొమ్ముకు ఎసరు పెట్టిందని, బిజెపి దాని అనుబంధ సంస్థలు, దొంగల దండుల దేశంపై పడ్డారని,చీమల దండులా కదిలి దొంగల దండును తరిమి వేయాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయమంటే కాంగ్రెస్ నేతలు బాధపడుతున్నారని, అయినా ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రశ్నిస్తూనే ఉంటామని కూనంనేని తెలిపారు. గెలుపు ఓటములు ఎన్నికల వరకే పరిమితమని, ఒకటి రెండు సీట్ల కోసం ప్రజా సమస్యల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ఈ సారి పోటీ తథ్యమన్నారు.

**హామీల అమలుకు పోరాటం-బాగం**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను, అమలు చేయడంలో తాత్సారం ప్రదర్శిస్తుందని, హామీలను విస్మరిస్తే ఆందోళన తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సన్నబియ్యం, ఉచిత బస్సు మినహా మిగిలిన హామీలలో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. సిపిఐ ప్రజాచైతన్య యాత్రతో హేమంతరావు మాట్లాడుతూ అప్పుల పేరుతో హామీలను అమలు చేయకపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. బిఆర్ఎస్ డబుల్ బెడ్రూం ఇండ్ల మాదిరే కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రాజకీయ వివక్ష పాటిస్తుందని, జెండా కప్పుకుంటునే ఇండ్లు కేటాయిస్తామనటం సరికాదు.సీతారామ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియచేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. మోడి ప్రజా వ్యతిరేక విధానాల పైనా, రాష్ట్రంలో హామీల అమలు కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందని హేమంతరావు స్పష్టం చేశారు.సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించగా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సభలో సిపిఐ నగర కార్యదర్శి షేక్ జానీమియా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం,బిజి క్లైమెంట్, అజ్మీరా రామమూర్తి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.ప్రజానాట్యమండలి,కళాకారులు సతీష్ బృందం అలపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

## పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి..

విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా



ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తప్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ÷ర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేలం పేరిట వెర్రిగా భూముల అమ్మకం

హైదరాబాద్,ఆగస్ట్13(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు.

# చేతనైతే అభివృద్ధికి సహకరించు..

**లేకుంటే ఇంట్లో మౌనంగా ఇంట్లో కూర్చో**

**ఆదిలాబాద్ సీసీఐ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తే ఊరుకునేది లేదు**

**ఆదిలాబాద్ లోఅభివృద్ధి పనులు వేగంగా అమలవుతున్నాయి**

**రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ యజమానులతో జోగు రామన్న కుమ్మక్కు**

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి**

**బిఆర్ ఎస్ నేత,మాజీ మంత్రి జోగు రామన్న పై ఆదిలా బాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నే తల తీవ్ర ఆగ్రహం**



ఆదిలాబాద్ బ్యూరో, ఆగష్టు 13, ప్రజా జ్యోతి ) చేత నయితే అభివృద్ధికి స హకరించు, లేకుంటే ఇంట్లో మౌనంగా కూర్చో కానీ ఆది లాబాద్ సిసిఐ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని భద్నాం చేస్తే ఊరుకునేదే లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ లో అ భివృద్ధి పనులు వేగవంతం గా అమలవుతున్నాయ ని దీనిని చూసి బిఆర్ ఎస్ నేత జోగు రామన్న ఓర్వ లేకపోతున్నాడని తీవ్రంగా విమర్శించారు. రేణుక సి మెంట్ తో జోగు రామన్నకు లోపాయి కారి ఒప్పందం ఉందని, ఆ కంపెనీతో కు మ్మక్కయ్యారని ఆరో పిం చారు. గురువారం అదిలా బాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కా ర్యాలయంలో విలేకరుల స మావేశం (ప్రెస్ మీట్) నిర్వ హించారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధి కార ప్రతినిధి బాలురి గోవర్ధ న్ రెడ్డి మాట్లాడుతూ బి ఆ ర్ ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జోగు రామన్న వ్యా ఖ్యలను తీవ్రంగా ఖండించా రు. బుదవారం జరిగిన సిసి ఐ సాధన కమిటీ సమావే శంలో ముఖ్య అతిథిగా వి చ్చేసిన ప్రొఫెసర్ కాశిం ఆది లాబాద్ జిల్లా ప్రజలకు స్ప ష్టమైన సందేశాన్ని ఇచ్చార ని తెలిపారు. తెలంగాణ ఉ ద్యమమే మూతపడిన పరి శ్రమలను తెరిపించాలనే ప్రధాన ఆకాంక్షతో ప్రారంభ మైందని గుర్తుచేశారని అ న్నారు. ఆదిలాబాద్ సిసిఐ పరిశ్రమ ఏర్పాటుపై స్పష్టత నిచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జోగు రా మన్న రెండు సార్లు ఎమ్మె ల్యేగా, ఒకసారి మంత్రిగా కొ నసాగినప్పుడు ఈ సిసిఐ పరిశ్రమ కానీ, ఇండస్ట్రియ ల్ కారిడార్ కానీ ఆయనకు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఈ రోజు రేవం త్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శి స్తూ సిసిఐ పరిశ్రమకు రూ. 250 కోట్లు కేటాయిం చాల ని మాట్లాడటం హాస్యాస్ప దంగా ఉందన్నారు. సిసిఐ పరిశ్రమ ఏర్పాటుకు ఒక ని ర్దిష్టమైన ప్రక్రియ ఉంటుంద ని, కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి జీవో (GO) అమలు చేస్తే, మా రాష్ట్ర ప్ర భుత్వ వాటా కింద రూ. 250 కోట్లను తప్పకుండా మంజూరు చేయడానికి ప్ర భుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కేవలం రా ష్ట్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చే యడం కోసం ఆయన సీసీఐ సాధన సమితి పెట్టిన ట్టుం దని అన్నారు. సీసీఐ కోసం కేంద్రంపై పోరాటం కోసం రా ష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించ డం మానేసి రాష్ట్ర ప్రభుత్వ సహకారం అడిగితే సీసీఐ సాధన కమిటీ తో కాంగ్రెస్ పార్టీ కలిసి వస్తుందని ఆయ న అన్నారు.జోగు రామన్న ఎమ్మెల్యేగా ఉన్న సమయం లో ప్రైవేట్ సంస్థ అయిన రే ణుక సిమెంట్ ఫ్యాక్టరీ కోసం యాపల్‌గూడ, రామ్‌పూర్ మరియు చుట్టుపక్కల గ్రా మాల అమాయక రైతులను మభ్యపెట్టి, ఎకరాకు కేవలం రూ. 5 నుండి 7 లక్షలకే వం దలాది ఎకరాల భూముల ను ఆ కంపెనీకి అప్పగించా రని ఆరోపించారు. ఇంతవ రకు ఆ కంపెనీ అక్కడ ఎటు వంటి పనులను ప్రారంభిం చకపోయినా, దానిపై జోగు రామన్న ఒక్క రోజు కూడా మాట్లాడకపోవడం వెనుక ఆ కంపెనీతో ఆయన లాలూచీ పడ్డారేమోననే బల మైన అనుమానం కలుగు తోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమల వుతున్నాయని, అదిలాబా ద్ జిల్లాలో అభివృద్ధి పను లు వేగంగా జరుగుతున్నా యని తెలిపారు. జోగు రా మన్నకు చేతనైతే అభివృద్ధి కి సహకరించాలని, లేదంటే ఇంట్లో కూర్చోవాలి తప్ప, ఊరికే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని బద్నాం చేసే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఈ సమావే శంలో జిల్లా అధికార ప్రతిని ధి బాలురి గోవర్ధన్ రెడ్డి తో పాటు, టౌన్ ప్రెసిడెంట్ కిజా ర్ పాషా, జిల్లా మీడియా కోఆర్డినేటర్ మేకల జితేంద ర్, యూత్ కాంగ్రెస్ జిల్లా సో షల్ మీడియా కోఆర్డినే టర్ శ్రీకర్ గౌడ్, తిరుమని మ హేందర్, టాపిక్, ఆసిఫ్, జో గు సంతోష్, కయ్యూమ్, ఇ తర కాంగ్రెస్ పార్టీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నా రు.

# 25 ఏళ్ళ సముజ్వల ప్రయాణం..

## సీఎమ్ఆర్ కళాశాలలో అత్యంత వైభవంగా 25వ ఓరియంటేషన్ వేడుకలు

హైదరాబాద్, ఆగస్టు 13(ప్రజాజ్యోతి): విద్యాబోధనలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుని, నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తూ పాతికేళ్ళు పూర్తి చేసుకున్న సీఎమ్ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 25వ ఓరియంటేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. "25 ఏళ్ళ సరికొత్త ప్రారంభం – అత్యుత్తమ పునాది – ఉజ్వల భవిష్యత్తు" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తగా చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ వేడుకలకు సీఎమ్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు చామకూర మల్లారెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ చామకూర గోపాల్ రెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చామకూర అభినవ్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు పాలకమండలి సభ్యులు చామకూర భూపాల్ రెడ్డి , చామకూర శ్రీశైలం రెడ్డి లు అతిథులుగా పాల్గొని నూతన విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన యాజమాన్య ప్రతినిధులు.. "విద్యార్థులు భయం లేకుండా నేర్చుకుంటూ, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, సమాజంలో బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదగడమే మా ధ్యేయం. గత 25 ఏళ్ళుగా యువతలోని ప్రతిభను వెలికితీసి వారిని అత్యున్నత స్థానాల్లో నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఈ ఓరియంటేషన్ వేడుక ఎంతో స్ఫూర్తిని నింపింది. విద్య, సాంకేతిక రంగాలలో నైపుణ్యంతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి సీఎమ్ఆర్ సంస్థలు ఇచ్చే ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ వేడుక సీఎమ్ఆర్ కుటుంబంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. కాగా కళాశాల విద్యార్థుల నృత్యాలు చూపరులను మంత్రముగ్దులను చేశాయి.









### పిల్లల ఆరోగ్యంపై

# ఆటలొద్దు

మొదటిపేజీ తరువాయి..

ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్-ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

మొదటిపేజీ తరువాయి..

మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు.

# గోదాదేవి... భక్తి పరిమళం వెదజల్లిన దివ్య నాచ్చియార్!

**నేడే గోదాదేవి (ఆండాళ్) తిరునక్షత్రం ప్రత్యేకం**

**కిటకిటలాడనున్న వైష్ణవ దేవాలయాలు**

**ప్రేమనే ప్రపత్తిగా, ప్రపత్తినే పరమ పథంగా చూపిన మహాభక్తురాలు**

**ఇందూర్తి ఆచార్య కళ్యాణ్. అద్యాపకులు ,జ్యోతీష్యులు ,పురోహితులు.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి , ఆగష్టు 13 ,( ప్రజాజ్యోతి ):

భక్తి అంటే ఏమిటి?
భగవంతుని ఆరాధించడం అంటే కేవలం పూజలు చేయడమేనా?
శరణాగతి అంటే ఏమిటి?

ఈ ప్రశ్నలకు తన జీవితాన్నే సమాధానంగా నిలిపిన దివ్య మహాభక్తురాలు శ్రీ గోదాదేవి ( ఆండాళ్ ). భగవంతునిపై అనన్యమైన ప్రేమతో, సంపూర్ణ శరణాగతితో జీవించి, తన భక్తి పరిమళాన్ని యావత్ ప్రపంచానికి పంచిన గోదాదేవి తిరునక్షత్రం శ్రీవైష్ణవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పర్వదినంగా భావించబడుతుంది.

### తులసీవనంలో లభించిన దివ్య వరం

"కర్కటే పూర్వఫల్గున్యాం తులసీకాననోద్భవాం , పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీ రంగనాయకీమ్."

శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తులవారు భగవంతునికి పూలమాలలు సమర్పిస్తూ భక్తితో జీవించేవారు. ఒక రోజు ఆయనకు తులసీవనంలో దివ్యమైన బాలిక దర్శనమిచ్చింది. ఆమెను దైవప్రసాదంగా భావించి తన కుమార్తెగా పెంచారు. ఆ బాలికే తరువాత గోదాదేవి, ఆండాళ్ గా జగద్విఖ్యాతురాలైంది.

చిన్ననాటి నుంచే గోదాదేవి హృదయం శ్రీమన్నారాయణునిపైనే నిలిచింది. స్వామివారినే తన జీవిత పరమలక్ష్యంగా భావించింది. ఆమెకు భౌతిక జీవితంలోని ఆకర్షణల కంటే భగవంతుని సాన్నిధ్యమే అత్యంత ప్రియమైనది.

### ముందుగా తాను ధరించి , స్వామికి సమర్పించిన మాల

విష్ణుచిత్తులవారు ప్రతిరోజూ స్వామివారికి సమర్పించేందుకు పూలమాలలు తయారు చేసేవారు. అయితే గోదాదేవి ఆ మాలను ముందుగా తాను ధరించి, అద్దంలో చూసుకుని, తరువాత స్వామివారికి సమర్పించేది.

ఒక రోజు ఈ విషయం విష్ణుచిత్తులవారికి తెలిసి బాధపడ్డారు. తాను ధరించిన మాలను భగవంతునికి ఎలా సమర్పిస్తారని భావించి, కొత్త మాలను తయారు చేసి సమర్పించారు. అయితే



స్వామివారు ఆ మాలను స్వీకరించలేదు. గోదాదేవి ధరించిన మాలనే తనకు ప్రీతికరమని భగవంతుడు తెలియజేశాడు అందుకే ఆమెకు "సూడిక్కొడుత్త నాచ్చియార్" అనే విశిష్టమైన పేరు వచ్చింది.

ఇక్కడ భక్తి యొక్క ఒక గొప్ప రహస్యం దాగి ఉంది. భగవంతునికి సమర్పించిన వస్తువుకంటే, దాని వెనుక ఉన్న నిష్కల్మషమైన ప్రేమ ఆయనకు ప్రీతికరం.

### ముప్పై పాశురాల్లో మధురమైన భక్తి

ఆండాళ్ రచించిన తిరుప్పావైలోని 30 పాశురాలు శ్రీవైష్ణవ భక్తి సాహిత్యంలో అమూల్యమైన ఆధ్యాత్మిక సంపద. ధనుర్మాసంలో ప్రతి రోజు ఒక పాశురాన్ని పారాయణం చేసే సంప్రదాయం నేటికీ విశేషంగా కొనసాగుతోంది. తిరుప్పావై కేవలం పాశురాల సమాహారం కాదు. అందులో భక్తి ఉంది ,ప్రపత్తి ఉంది , సత్సంగం ఉంది ,లోకక్షేమం ఉంది ,భగవంతుని పట్ల అనన్యమైన ప్రేమ ఉంది.

"ఆళి మళై క్కణ్ణా..." అంటూ వర్షాలు సమృద్ధిగా కురిసి, సమస్త జీవులు సుఖసంతోషాలతో ఉండాలని ఆండాళ్ ప్రార్థించిన తీరు ఆమె భక్తి ఎంత విశాలమైనదో తెలియజేస్తుంది.

తనకోసం మాత్రమే కాకుండా సర్వలోక క్షేమాన్ని కోరిన భక్తి గోదాదేవి (ఆండాళ్ ) భక్తి.

### ప్రేమలోనే శరణాగతి

గోదాదేవి (ఆండాళ్ ) రచించిన నాచ్చియార్ తిరుమొళిలో భగవంతుని పొందాలనే ఆమె తపన మరింత స్పష్టంగా కనిపిస్తుంది. శ్రీమన్నారాయణుడే తన జీవిత పరమగమ్యమని భావించిన ఆమె, తన మనసును పూర్తిగా భగవంతుని పాదాల వద్ద సమర్పించింది.

అందుకే గోదాదేవి (ఆండాళ్) జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. భగవంతుని చేరుకోవడానికి భక్తి మాత్రమే కాదు ఆ భక్తిలో సంపూర్ణమైన విశ్వాసం, ప్రేమ,



శరణాగతి ఉండాలి.

### నేటి తరానికి గోదాదేవి (ఆండాళ్) సందేశం

కాలం మారింది. జీవన విధానం మారింది. సాంకేతిక ప్రపంచం మనిషిని ఎంతగానో ముందుకు తీసుకెళ్లింది. కానీ మనశ్శాంతి కోసం, జీవితం యొక్క పరమార్థం కోసం మనిషి వెతుకుతూనే ఉన్నాడు.

ఇలాంటి సమయంలో గోదాదేవి (ఆండాళ్ )జీవితం నేటి తరానికి ఎంతో విలువైన సందేశాన్ని అందిస్తుంది.

భక్తి అంటే మూఢనమ్మకం కాదు.
భక్తి అంటే భయంతో చేసే ఆరాధన కాదు.
భక్తి అంటే భగవంతునిపై నమ్మకం , ప్రేమ , శరణాగతి.

గోదాదేవి (ఆండాళ్ )తన జీవితంతో ఇదే సత్యాన్ని చాటిచెప్పింది.

### ప్రతి ఇంటా తిరుప్పావై పరిమళించాలి

గోదాదేవి ( ఆండాళ్ ) తిరునక్షత్రోత్సవం కేవలం ఒక ఉత్సవంగా ముగియకుండా, ప్రతి ఇంటా తిరుప్పావై పాశురాల పారాయణం జరగాలి.



పిల్లలకు గోదాదేవి చరిత్రను తెలియజేయాలి. మన సంస్కృతి, సంప్రదాయాలు, దివ్యప్రబంధ సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి. ఆండాళ్ తల్లి చూపిన భక్తి మార్గంలో నడుస్తూ, భగవంతునిపై విశ్వాసంతో, సమాజ శ్రేయస్సును కోరుకుంటూ జీవించడమే ఆమెకు మనం సమర్పించగల నిజమైన భక్తి.

"గోదాదేవి కృపాకటాక్షాలతో ప్రతి హృదయంలో భక్తి పరిమళించాలి. ప్రతి ఇంటా శాంతి, సౌభాగ్యం నెలకొనాలి. సర్వలోకాలకు మంగళం కలగాలి."

ఆండాళ్ దివ్య తిరువడిగలే శరణం!

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967